




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 07 సోమవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 292
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatnam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

◆ హెచ్చరించిన ఐఎండీ



2

## వెండితెర రారాజులు రాజకీయాల్లో హిట్ ఫట్టా?



5

## 20 ఏళ్లకు కలిసిన అన్నదమ్ములు..

◆ మరాఠా రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ సీన్..



5

## కోరుట్ల చిన్నారి హత్య కేసులో ట్విస్ట్...

హంతకురాలు ఆవిడేనా!



2

## వెలుగులోకి ధర్మస్థలిలో దారుణ హత్యలు



2

## ఐటీఆర్ గడువు మళ్లీ పొడిగింపు?

2



## త్యాగానికి ప్రతీక మొహర్రం

● ఆ త్యాగం అనుపమానం



# పాకిస్థాన్‌కు మైక్రోసాఫ్ట్ గుడ్‌బై

● 25 ఏళ్ల బంధానికి తెర
● మైక్రోసాఫ్ట్ తిరుగులేని నిర్ణయం
● 25 ఏళ్ల సేవల ముగింపు ప్రకటన
● కంపెనీలో మిగిలిన కేవలం ఐదుగురు ఉద్యోగులు
● పాతికేళ్ల ప్రయాణాన్ని గౌరవంగా పరిగణించిన సంస్థ
● ఉపాధి అవకాశాల తగ్గుదల
● నిరుద్యోగ రేటు పెరిగే ప్రమాదం
● సామాజిక అసంతృప్తి పెరిగే పరిస్థితి

2

పాక్‌ను వదిలిన 25 ఎంఎన్‌సీలు



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

పాకిస్థాన్ కు బిగ్ షాక్ తగిలింది. ఆ దేశం నుంచి వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతున్నట్లు ప్రముఖ ఎమ్ఎన్‌సీ సంస్థ, టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ అధినేత జవాద్ రెహ్మాన్ లింక్డ్ ఇన్ వేదికగా తెలిపారు. దీంతో ఆ దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు భారీగా తగ్గపోయి.. నిరుద్యోగ రేటు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు పాకిస్థాన్ పరిస్థితి తయారైంది. ఇప్పటికే భారత్ తో యుద్ధం, వాణిజ్యంపై ఆంక్షలు, ద్రవ్యోల్బణం, రాజకీయ అస్థిరత, నిధుల కొరత, నీటి సంక్షోభంతో ఆ దేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశానికి మరో ఊహించని షాక్ తగిలింది. పాకిస్థాన్ ను నిష్క్రమించేందుకు సిద్ధం అవుతున్నట్లు ప్రముఖ ఎమ్ఎన్‌సీ సంస్థ, టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు ఆ సంస్థ అధినేత జవాద్ రెహ్మాన్ లింక్డ్ ఇన్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. జూన్ 2000 సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ సంస్థ పాకిస్థాన్ లోకి అడుగు పెట్టింది. తాజాగా ఆ దేశం నుంచి వెళ్లిపోతున్నట్లు ఆ సంస్థ వెళ్లిపోతున్నట్లు సంస్థ అధినేత తెలపడంతో పాకిస్థాన్ లో 25 ఏళ్ల మైక్రోసాఫ్ట్ ప్రస్థానానికి ముగింపు పలికినట్లు అయింది. అయితే ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ సంస్థ అధికారికంగా ప్రకటించక పోయినప్పటికీ ఇప్పటికే అనేక కార్యక్రమాలను ఆ సంస్థ నిలిపివేసింది. భారీ సంఖ్యలో లే ఆఫ్ లు ప్రకటించింది. ఇప్పుడు ఆ సంస్థలో కేవలం ఐదుగురు ఉద్యోగులు మాత్రమే ఉండటం గమనార్హం. "ఎండ్ ఆఫ్ యాన్ ఎరా.. పాకిస్థాన్ లో మైక్రోసాఫ్ట్ సంస్థను జూన్ 2000 లో ప్రారంభించాం. పాకిస్థాన్ లో 25 ఏళ్ల మైక్రోసాఫ్ట్ ప్రస్థానానికి ముగింపు పలకనుంది. ఇప్పటికే ఉద్యోగులు వెళ్లిపోయారు. మరికొంత మంది త్వరలో నిష్క్రమిస్తారు. పాతికేళ్ల పాటు ఈ సంస్థను పాకిస్థాన్ లో నడిపినందుకు గౌరవంగా భావిస్తున్నా.." అని ఆ సంస్థ అధినేత జవాద్ రెహ్మాన్ లింక్డ్ ఇన్ వేదికగా ఈ విషయాన్ని

# చరిత్ర తిరగరాసిన టీమిండియా

◆ బర్మింగ్‌హామ్‌లో భారత్ కొత్త చరిత్ర..
◆ 58 ఏండ్లుగా ఊరిస్తూ వచ్చిన విజయం
◆ ఇంగ్లండ్‌పై 336 పరుగులతో ఘన విజయం
◆ 6 వికెట్లతో ఆకాశ్‌దీప్ విజృంభణ
◆ కెప్టెన్‌గా గిల్‌కు చిరస్మరణీయ గెలుపు

2



**బర్మింగ్‌హామ్-నవభూమిబ్యూరో**

బర్మింగ్‌హామ్‌లో భారత్ కొత్త చరిత్ర.. ఇంగ్లండ్‌పై 336 పరుగులతో ఘన విజయం ఎన్నాళ్లకెన్నాళ్లకు! 58 ఏండ్లుగా ఊరిస్తూ వచ్చిన విజయం ఎట్టకేలకు దరిచేరింది. ఇన్నాళ్లు కొరకరాని కొయ్యగా మారిన బర్మింగ్‌హామ్‌లో భారత్ కొత్త చరిత్ర లిఖించింది. దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును అంతగా అనుభవం లేని కుర్రాళ్లతో కూడిన నయా టీమ్‌ఇండియా చేతల్లో చూపెట్టింది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు! 58 ఏండ్లుగా ఊరిస్తూ వచ్చిన విజయం ఎట్టకేలకు దరిచేరింది. ఇన్నాళ్లు కొరకరాని కొయ్యగా మారిన బర్మింగ్‌హామ్‌లో భారత్ కొత్త చరిత్ర లిఖించింది. దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును అంతగా అనుభవం లేని కుర్రాళ్లతో కూడిన నయా టీమ్‌ఇండియా చేతల్లో చూపెట్టింది. ఇంగ్లండ్‌కు పెట్టనికోట లాంటి బర్మింగ్‌హామ్‌ను బద్దలు కొడుతూ 336 పరుగుల తేడాతో భారత్ విజయదుందుభి మోగించింది. వరుణుడి అంతరాయంతో మ్యాచ్ ఆలస్యంగా మొదలైనా ఆకాశ్‌దీప్ ఆరు వికెట్ల విజృంభణతో చిరస్మరణీయ గెలుపును సొంతం చేసుకుంది. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన గిల్‌సేన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుని ఔరా అనిపించుకుంది.

భారత క్రికెట్‌లో కొత్త అధ్యాయం! దిగ్గజాలు విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ, అశ్విన్ నిష్క్రమణ తర్వాత పరివర్తన దశలో ఉన్న టీమ్‌ఇండియా ఇంగ్లండ్ గడ్డపై కొత్త చరిత్రకు నాంది పలికింది. నూనుగు మీసాల శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ఇంగ్లండ్‌ను రెండో టెస్టులో మట్టికరిపించింది. పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన పోరులో టీమ్‌ఇండియా 336 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. తద్వారా విదేశీ గడ్డపై పరుగుల పరంగా భారీ గెలుపును ఖాతాలో వేసుకుంది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 608 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 72/3 ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ 271 పరుగులకు ఆలౌటైంది. ఆకాశ్‌దీప్(6/99) ఆరు వికెట్లతో ఇంగ్లండ్

# తెలంగాణ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు

● పదోతరగతి విద్యార్థులకే ప్రాధాన్యత
● తొలి దశలో జూలై 8న 5 వేల సైకిళ్ల పంపిణీ
● ఒక్కో సైకిల్ విలువ రూ.4,000
● పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనకరమైన పథకం

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ విద్యార్థులకు భారీ శుభవార్త. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. రూ. 4 వేల విలువైన సైకిల్ విద్యార్థులకు ఉచితంగా అందనుంది. మరి ఏ జిల్లాల వారికి ఈ సైకిళ్లు అందుతాయి. ఎవరెవరికి ఈ సైకిళ్లు అందుతాయో ఇక్కడ తెలుసుకోండి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా ఉచితంగా 20 వేల సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11న బండి సంజయ్ పుట్టిన రోజును పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు.

కరీంనగర్ జిల్లాలో టెన్త్ చదివే పిల్లలు 3,096 మంది ఉన్నారు. కరీంనగర్ తోపాటు రాజన్న సిరిసిల్లలో 3,841, జగిత్యాల జిల్లాలో 1,137, సిద్దిపేటలో 783, హన్మకొండ జిల్లాలో 491 మంది.. మొత్తం కలిపి 9,348 మంది బాలబాలికలు పదో తరగతి చదువుతున్నారు. ఇక కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ కు 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. వీటితోపాటు ఒక్కో మండలానికి వంద చొప్పున

# పోలవరం పనులపై డెడ్‌లైన్

● హంద్రీనీవా ఫేజ్-1 జూలై 15నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశం
● పోలవరం ఎడమ కాల్వను జూలై 31లోపు పూర్తిచేయాలి
● గాలేరు నగరి కెనాల్ పనులు వెంటనే ప్రారంభించాలి
● వెలిగొండ ప్రాజెక్టు 2026 జూన్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం

**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఈ నెల 15వ తేదీ నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్-1 పనులు పూర్తి చేసి జీడిపల్లి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం మేరకు 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఫేజ్-2 కాలువ ద్వారా పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు జులై 31న నీటిని విడుదల చేయాలని సూచించారు. గాలేరు నగరి ద్వారా కడపకు నీళ్లు ఇచ్చేందుకు పనులు ప్రారంభించాలని దిశానిర్దేశం చేశారు. పోలవరం ఎడమ కాల్వ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయలన్న సీఎం, 2026 జూన్‌కు వెలుగొండను పూర్తిచేసి నీళ్లివ్వాలని లక్ష్యాలను నిర్దేశించారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# మహిళా ఉద్యోగులకు శుభవార్త

● పిల్లల సంరక్షణకు క్రెష్‌లు
● ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
● 216 ప్రాంతాల్లో ప్రణాళిక
● వంద మంది మహిళలు ఉన్న చోటే
● అమరావతిలో మోడల్ క్రెష్
● కేంద్రానికి ప్రతిపాదనలు
● చంద్రబాబు హామీ అమలు దిశగా



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీలో పని చేసే ప్రభుత్వ మహిళా ఉద్యోగుల కోసం శుభవార్త చెప్పబోతోంది. ఉద్యోగం చేసే మహిళలు పిల్లల అలనా పాలనా చూసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని భావించిన చంద్రబాబు సర్కార్ మహిళలకు ఇకపై ఆ ఇబ్బంది లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయబోతోంది. మహిళలకు శుభవార్త చెప్పనున్న చంద్రబాబు సర్కార్ మహిళలు ఇటు జాబ్ ను అటు పిల్లల అలనా పాలనను చూసుకోవడానికి ఇబ్బంది పడుతున్న క్రమంలో, ఈ మెంటల్ స్ట్రెస్ నుండి మహిళలకు విముక్తి కల్పించాలని నిర్ణయించిన ఏపీ సర్కార్ పని

## శ్రీశైలానికి ఐదేళ్లలో కొత్త గేట్లు పెట్టాలి!

**దోమలపెంట-నవభూమి:** శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మార్చాలని భారీ ప్రాజెక్టు గేట్ల నిపుణుడు నాగినేని కన్నయ్య నాయుడు చెప్పారు. మరో ఐదేళ్లలో కొత్త గేట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే గత ఏడాది తుంగభద్ర డ్యాం పరిస్థితే శ్రీశైలం ప్రాజెక్టుకూ ఎదురయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన శ్రీశైలం ప్రాజెక్టును అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

# టెక్నాలజీతో కొత్త ముప్పు మీ మెదడును హ్యాక్ చేయొచ్చు!

● మెదడును హ్యాక్ చేయడం సైన్స్ ఫిక్షన్ కాదని హెచ్చరిస్తున్న నిపుణులు
● బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీతో కొత్త ముప్పులు
● మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ దొంగిలించి ఆలోచనలు తెలుసుకునే ప్రమాదం
● స్వేచ్ఛను కాపాడేందుకు 'కాగ్నిటివ్ లిబర్టీ' హక్కు అవసరమన్న వాదన
● మెదడుకు సైబర్ భద్రత కల్పించేందుకు వస్తున్న 'న్యూరోసెక్యూరిటీ' రంగం

2



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

మనిషి మెదడును హ్యాక్ చేయడం అనేది ఇప్పటివరకు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూశాం. కానీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఇది భవిష్యత్తులో నిజమయ్యే ప్రమాదం ఉందని న్యూరోసైన్స్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీ ఈ సరికొత్త ముప్పునకు దారులు తెరుస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెక్నాలజీతో ముప్పు ఎలా?..ఆలోచనల ద్వారా కంప్యూటర్లు, ఇతర పరికరాలను నియంత్రించేందుకు బీసీఐ టెక్నాలజీ ఉపయోగ పడుతుంది. శరీరంలో అమర్చే ఇంప్లాంట్లు లేదా తలపై ధరించే సెన్సార్ల ద్వారా ఇది పనిచేస్తుంది. అయితే, ఈ సాంకేతికతే హ్యాకర్లకు ఒక ఆయుధంగా మారవచ్చని కార్నెల్ యూనివర్సిటీ అధ్యయనం హెచ్చరించింది. హ్యాకర్లు మెదడు నుంచి కంప్యూటర్‌కు వెళ్లే డేటాను అడ్డగించి, మన ఆలోచనలను చదివే ప్రమాదం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.అంతేకాదు, మెదడుకు పంపే సిగ్నల్స్‌ను తారుమారు చేసి మన భావోద్వేగాలు, నిర్ణయాలు, ప్రవర్తనను కూడా ప్రభావితం చేయవచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు, పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులకు వాడే డీప్-బ్రెయిన్ స్టిమ్యులేటర్లను హ్యాక్ చేసి, మెదడు పనితీరును మార్చేయగలరని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ గ్లోబల్ క్యాంపస్ నివేదిక పేర్కొంది.

**మానసిక స్వేచ్ఛకు గ్యారెంటీ ఏది?**

# రూ.4,215 కోట్ల స్కాం

◆ ఫాల్కన్ కంపెనీ సీఓఓను అరెస్ట్ చేసిన తెలంగాణ సీఐడీ
◆ రూ.4,215 కోట్ల ఫాల్కన్ యాప్ స్కామ్‌లో కీలక అరెస్ట్
◆ ఫాల్కన్ గ్రూప్ సీఓఓ ఆర్యన్ సింగ్‌ను పట్టుకున్న తెలంగాణ సీఐడీ
◆ పంజాబ్‌లోని భటిండాలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
◆ ఫేక్ యాప్ ద్వారా అధిక వడ్డీ ఆశ చూపి భారీ మోసం
◆ దేశవ్యాప్తంగా 7 వేల మంది నుంచి డిపాజిట్లు సేకరణ
◆ ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 10 మంది అరెస్ట్

2

4,065 మంది బాధితులు రూ.792 కోట్లు నష్టపోయారు



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.4,215 కోట్ల ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ యాప్ స్కామ్‌లో తెలంగాణ సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఫాల్కన్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ఆర్యన్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని భటిండాలో జులై 4న అతడిని అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందం, ట్రాన్సిట్ రిమాండ్‌పై ఆదివారం హైదరాబాద్‌కు తరలించింది. అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా వెల్లడించారు.

క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ 'ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్' పేరుతో ఒక మొబైల్ అప్లికేషన్‌ను సృష్టించింది. ప్రముఖ బహుళజాతి కంపెనీల పేరుతో నకిలీ

## వందేభారత్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..



మహబూబాబాద్, -నవభూమి:విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. మహబూబాబాద్ జిల్లాలోని తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అప్ లైన్‌లో 428/11 వద్ద రైల్వే ట్రాక్‌పైకి వచ్చిన ఎద్దును వేగంగా వస్తున్న వందేభారత్ రైలు ఢీ కొట్టింది. దీంతో కొన్ని నిమిషాల పాటు ట్రాక్‌పై ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. ఈ ఘటనపై సమీపంలోని రైల్వే స్టేషన్ అధికారులకు వందేభారత్ సిబ్బంది సమాచారం అందించారు. దీంతో అధికారులతోపాటు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ట్రాక్‌పై ఉన్న ఎద్దును తొలగించారు.అయితే ఈ ఘటనలో రైలు ఇంజన్ ముందు భాగం విరిగిపోయింది. ఆ తర్వాత రైలు సికింద్రాబాద్‌కు బయలుదేరింది. రైల్వే ట్రాక్‌పై వందేభారత్ నిలిచిపోవడంతో.. ఆ ట్రాక్‌పై వచ్చే రైళ్లను కొద్దిసేపు నిలిపివేశారు. ఈ సమయంలో వందేభారత్‌లోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు ఈ ఎద్దు యజమాని కోసం సమీపంలోని రైల్వే స్టేషన్ అధికారులు గాలిస్తున్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు స్టేషన్ అధికారులు చెప్పారు.

## నవ వార్త




## హైదరాబాద్‌లో దొంగల బీభత్సం.. తాళాలు పగులగొట్టి..



**హైదరాబాద్-నవభూమి:** నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఇనాంగూడలో దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి మూడు రియల్ ఎస్టేట్ కార్యాలయాల తాళాలు పగులగొట్టి అందులోకి ప్రవేశించారు. ఆఫీసులో ఉన్న వస్తువులను చిందర వందరగా పడవేశారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, కార్యాలయ ఫర్నీచర్ మొత్తాన్ని ధ్వంసం చేశారు. వరుసగా మూడు రియల్ ఎస్టేట్ కార్యాలయాలతో పాటు ఓ ఇంట్లో చోరీకి దొంగలు పాల్పడ్డారు. రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పార్క్ చేసి ఉన్న ఇన్నోవా కారుని ధ్వంసం చేశారు. మరో ఇంట్లో ఉన్న కారుని వేసుకొని స్థానికంగా దర్జాగా తిరిగారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ చోరీల్లో సుమారు రూ. 30 వేల నగదుని దొంగలు అపహరించారు.బాధితులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. స్థానికంగా ఉన్న సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. సీసీ టీవీలో రికార్డు అయిన ఫుటేజ్ ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దొంగల ప్రవర్తనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాలనీల్లో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, భద్రత పరంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## డిప్లొమోను ఇంటర్‌తో సమానంగా పరిగణించాలి: హైకోర్టు



**హైదరాబాద్-నవభూమి:** స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (పాలిటెక్నిక్) డిప్లొమో కోర్సు ఇంటర్మీడియట్‌తో సమానమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ డిప్లొమో పూర్తి చేసిన అభ్యర్థులను ఇంటర్ అర్హతగా నిర్ణయించిన కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించాలని ఆదేశించింది. ఇంటర్ అర్హతగా ఉన్న ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లొమో కోర్సు (డీఈఈసెట్-2025) చేసేందుకు అనుమతించడం లేదంటూ మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన హరీశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2001లో జారీచేసిన జీవో 112 ప్రకారం పాలిటెక్నిక్ డిప్లొమోను ఇంటర్‌కు సమానంగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఏకీభవించిన హైకోర్టు ఆయనను కౌన్సెలింగ్‌కు అనుమతించి, అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించింది.ప్రైవేటు పట్టా భూముల్లో ప్రధాన, పిల్ల కాలువలు నిర్మించాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టం నిర్దేశిస్తున్న నిబంధనలను అనుసరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. భూసేకరణ చేపట్టి, రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం మల్కపేట గ్రామ పరిధిలో చేపడుతున్న కాలువల పనులకు సంబంధించి దాఖలైన వ్యాజ్యంపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల భూముల్లో కాలువలు నిర్మించాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేపట్టి పరిహారం ఇవ్వాలని పేర్కొంది.

## కోదాడలో బయటపడినవి.. చాళుక్య భీమ నాటి రాగి పలకలు



**కోదాడ-నవభూమి:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఇటీవల బయటపడిన రాగి పలకలు వేంగి చాళుక్యుల నాటి భీమ-1 కాలానికి చెందినవిగా పురావస్తుశాఖ అధికారులు గుర్తించారు. కోదాడ పట్టణం ఖబ్రస్థాన్‌లో ఏప్రిల్ 29న గుంతలు తవ్వుతుండగా మట్టికుండలో తొమ్మిది సెట్ల రాగి పలకలు లభించాయి. వీటిని రెవెన్యూ సిబ్బంది హైదరాబాద్‌లోని పురవాస్తుశాఖకు పంపారు. ఇటీవల వీటిని రసాయనాలతో శుద్ధిచేసి వెంగి చాళుక్య భీమ-1 (క్రీ.పూ.888-918) కాలంనాటివిగా పురావస్తుశాఖ గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.మూడు రాగి పలకలపై సంస్కృతంలో చాళుక్య భీమ-1కు సంబంధించిన వివరాలున్నాయని పేర్కొన్నారు. అలాగే వరాహ, స్వస్తి త్రిభువనాంకుశతో కూడిన చిహ్నం ఉందని, రాగి పలకలపై ఉన్న సమాచారం చాళుక్యుల చరిత్రను తెలియజేస్తోందన్నారు. ఈ పలకలు సుమారు 50 కిలోల బరువు ఉన్నాయని, ప్రస్తుతం ఇవి తెలంగాణ వారసత్వశాఖ ఆధీనంలో ఉన్నాయని అధికారులు తెలిపారు.

## డిజిటల్ అరెస్టు పేరుతో.. వృద్ధుడికి రూ.53 లక్షల కుచ్చుటోపీ



**హైదరాబాద్-నవభూమి:**77 ఏళ్ల ఓ వృద్ధుడిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్ల ముఠా.. రూ.53 లక్షలను కొల్లగొట్టిన ఉదంతమిది. అమీర్‌పేట్‌కు చెందిన బాధితుడికి.. సైబర్ నేరగాళ్ల నుంచి వీడియోకాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనను తాను ఢిల్లీ డీసీపీ రాజ్‌వీర్‌కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. "మీపై ఢిల్లీలో మనీల్యాండరింగ్ కేసు నమోదైంది. మీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించాం.

మీపై అరెస్టు వారెంట్ ఇష్యూ అయ్యింది" అని భయపెట్టాడు. బాధితుడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును ఆర్బీఐ ఖాతాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. "ఒకవేళ మీ తప్పు లేదని తెలిస్తే.. ఆర్బీఐ మీ డబ్బును తిరిగి ఇచ్చేస్తుంది" అని నమ్మబలికాడు. అది నిజమని నమ్మిన బాధితుడు రూ.53 లక్షలను మోసగాళ్లు పేర్కొన్న బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. తన డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇక నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది.బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచి 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, వికారాబాద్ సహా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో 42కి చేరిన మృతులు.. ఇంకా దొరకని 9 మంది ఆచూకీ



**సంగారెడ్డి-నవభూమి:** పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మరొకరు చనిపోయారు. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య 42కి చేరింది. ఈ ఘటనలో మరో తొమ్మిది మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమవై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు. ప్రమాదం సంభవించి ఏడు రోజులైనా కార్మికులను గుర్తించడంలో ఎలాంటి పురోగతి లేదంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.

కాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ధృవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 9 మందిలో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు 40 నుంచి 80 శాతానికిపైగా కాలిన గాయాలతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం భీం రావు అనే కార్మికుడు మృతిచెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్ చౌదరి చనిపోయారు. తాజాగా మరో కార్మికుడు మరణించడంతో మరణాల సంఖ్య 41కి పెరిగింది.

# పోలవరం పనులపై డెడ్‌లైన్

(1వపేజీ తరువాయి)నిర్వహించారు. హంద్రీ నీవా సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటి మట్టాలు, నీటి నిర్వహణకు చేపడుతున్న చర్యలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో అత్యుత్తమ స్థాయిలో నీటి నిర్వహణ చేసి ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. దీని కోసం పూర్తి స్థాయి ప్రణాళికతో ప్రభుత్వ శాఖలు, అధికారులు పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెంపుపై మరింత శ్రద్ధ తీసుకోవాలని, ఈ అంశంలో ఇరిగేషన్ శాఖతో పాటు పంచాయతీ రాజ్ శాఖను కూడా భాగస్వామిని చేయాలని సీఎం అన్నారు.గాలేరు నగరి కెనాల్ పనులు త్వరలోనే ప్రారంభించాలి: రానున్న రోజుల్లో కురిసే వర్షాల కారణంగా సమృద్ధిగా అన్ని ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరుతుందని, సమగ్ర నిర్వహణ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సీఎం అన్నారు. వచ్చే ప్రవాహాలను హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు ద్వారా సీమలో ప్రతి ప్రాంతానికీ తరలించి అన్ని రిజర్వాయర్లు నింపాలని ఆదేశించారు. పెన్నా బేసిన్‌లో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు ఎక్కువ అవకాశం ఉందని, ప్రస్తుతం ఆ ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీరు ఇచ్చి, అనంతరం ప్రాజెక్టులను నింపాలన్నారు. అదే విధంగా కడపకు నీళ్లు ఇచ్చే గాలేరు నగరి కెనాల్ పనులను కూడా త్వరలోనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హంద్రీనీవా ఫేజ్ 2 కాలువ ద్వారా చిత్తూరు జిల్లాలోని చివరి ప్రాంతాలకూ నీరు ఇచ్చేందుకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.

ప్రకాశం జిల్లాకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. దీనికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు వేగం పెంచి జులై 31కి పూర్తి చేయాలన్నారు. అనకాపల్లి వరకు నీరు తీసుకువెళ్లేందుకు అవసరమైన 7 ప్యాకేజీలు పూర్తి చేయాలని, ఇందులో ఎలాంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించి నిర్దేశించిన సమయంలోపు పూర్తి చెయ్యాలని సూచించారు. తారకరామ తీర్థ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేయాలని, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేయాలన్నారు.వంశధార-నాగావళి అనుసంధానంలో పెండింగ్ పనులను పూర్తిచేయాలని సీఎం స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని వీటికి అనుసంధానించేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కురిసే వర్షపాతం, నదుల నుంచి వచ్చే ఇన్ ఫ్లోస్, భూగర్భ జలాలు, సాగు, తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని లెక్కించి పక్కాగా వాటర్ ఆడిటింగ్ చేయాలన్నారు. వాసార్ ల్యాబ్స్ ద్వారా నీటి ఆడిటింగ్ చేపట్టి, సమర్ధ నీటి వినియోగం కోసం అవసరమైన ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. పని చేయకుండా ఉన్న ఫిజియోమీటర్లు, వాటర్ లెవల్ తెలిపే సెన్సార్ సిస్టం, రెయిన్ గేజ్ స్టేషన్స్‌ను అందుబాటులోకి తేవాలన్నారు. దీనికి అవసరమైన నిధులు మంజూరుకు సీఎం అంగీకారం తెలిపారు.భూగర్భ జల మట్టాలను కనిష్టం 3 మీటర్లు, గరిష్టం 8 మీటర్లు లక్ష్యాన్ని సాధించేలా జలవనరుల శాఖ పని చేయాలని సీఎం అన్నారు. చీఫ్ ఇంజనీర్‌లు ప్రాజెక్టులు మాత్రమే తమ పరిధి అనుకోకుండా, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపులో కూడా భాగస్వాములు కావాలని సూచించారు. పూడిక తీత, చెరువులు నింపడం, చెక్ డ్యాంల నిర్మాణం వంటి చర్యల ద్వారా భూగర్భ జలాలపెంపు లక్ష్యాన్ని సాధించాలని దిశానిర్దేశం చేశారు. నీటి నిర్వహణను సక్రమంగా చేస్తే కరవు అనే పరిస్థితి ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి రామానాయుడు, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెక్నాలజీతో కొత్త ముప్పు మీ మెదడును హ్యాక్ చేయొచ్చు!

**(1వపేజీ తరువాయి)**ఈ టెక్నాలజీ వల్ల 'న్యూరోప్రైవసీ' అనే కొత్త సమస్య తెరపైకి వచ్చింది. మన మెదడులోని డేటా బయటకు తెలిస్తే, అనారోగ్య సమస్యలు లేదా వ్యక్తిగత ఆలోచనలు బహిర్గతమవుతాయి. దీన్ని నిపుణులు 'కాగ్నిటివ్ లిబర్టీ' (మానసిక స్వేచ్ఛ) ఉల్లంఘనగా అభి వర్ణిస్తున్నారు. ప్రతి వ్యక్తికి తమ ఆలోచనలపై పూర్తి నియంత్రణ, గోప్యత ఉండే హక్కును కల్పించాల్సిన అవసరం ఉందని టైమ్ నివేదిక నొక్కి చెప్పింది.

**పరిష్కారంగా 'న్యూరోసెక్యూరిటీ'!**

అయితే, ప్రస్తుతం విస్తృత స్థాయిలో 'మైండ్ కంట్రోల్' చేసేంత శక్తివంతమైన టెక్నాలజీ అందుబాటులో లేదని యునెస్కో కొరియర్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, భవిష్యత్ ముప్పును ఎదుర్కొనేందుకు నిపుణులు 'న్యూరోసెక్యూరిటీ' అనే కొత్త విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. కంప్యూటర్లను కాపాడే సైబర్ సెక్యూరిటీ తరహాలోనే, మెదడుకు అనుసంధానించిన పరికరాలను ఎన్‌క్రిప్షన్, సురక్షిత ప్రోటోకాల్స్ ద్వారా రక్షించడమే దీని లక్ష్యం. బీసీఐ టెక్నాలజీ వైద్య రంగం నుంచి వినియోగదారుల చేతికి వస్తున్న తరుణంలో, కఠినమైన భద్రతా నియమావళి, నైతిక మార్గదర్శకాలు తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు.

## రూ.4,215 కోట్ల స్కాం

**(1వపేజీ తరువాయి)**డీల్స్ సృష్టించి, స్వల్పకాలిక పెట్టుబడులపై అధిక వడ్డీ ఇస్తామంటూ సోషల్ మీడియా, టెలీకాలర్ల ద్వారా విపరీతంగా ప్రచారం చేశారు. దీనిని నమ్మిన అమాయక ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించారు.ఈ స్కామ్ ద్వారా నిందితులు దేశవ్యాప్తంగా 7,056 మంది నుంచి సుమారు రూ.4,215 కోట్లు వసూలు చేశారు. వీరిలో 4,065 మంది బాధితులు రూ.792 కోట్లు నష్టపోయినట్లు సీఐడీ విచారణలో తేలింది. బాధితుల ఫిర్యాదుల మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదు కాగా, వాటిని తదుపరి దర్యాప్తు కోసం సీఐడీకి బదిలీ చేశారు.

## కోరుట్ల చిన్నారి హత్య కేసులో ట్విస్ట్... హంతకురాలు ఆవిడేనా!

**జగిత్యాల జిల్లా -నవభూమి:**జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఐదేళ్ల చిన్నారి హితీక్ష హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారి అదృశ్యమైన కొద్ది గంటలకే పక్కింటి బాత్రూమ్‌లో రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటన వెనుక కుటుంబ కలహాలే కారణమని, బాలిక సొంత పిన్ని మమతనే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే, శనివారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన హితీక్ష, సమీపంలో జరుగుతున్న వినోద కార్యక్రమం చూసేందుకు వెళ్లింది. తిరిగివచ్చిన కాసేపటి తర్వాత, రాత్రి 7:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. ఆ తర్వాత పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి నవీన, రాత్రి 8:30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గాలింపు చేపట్టిన పోలీసులకు, పక్కింటి బాత్రూమ్‌లో గొంతు కోయబడిన స్థితిలో చిన్నారి మృతదేహం లభ్యమైంది.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. కుటుంబ సభ్యులను విచారించగా, కుటుంబంలో ఉన్న విభేదాలే హత్యకు దారితీసి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఉపాధి కోసం గల్ఫ్‌లో ఉన్న చిన్నారి తండ్రి రాములు, విషయం తెలిసి హుటాహుటిన స్వదేశానికి బయలుదేరారు.

కేసులో పోలీసులను వేధిస్తున్న ప్రశ్నలు

అయితే, ఈ కేసులో పోలీసులకు పలు చిక్కుముడులు ఎదురవుతున్నాయి. బాలిక మృతదేహం లభ్యమైన ఇంటి యజమాని కొడిపెల్లి విజయ్, తాను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. విజయ్ ఊళ్లో లేకపోతే, బాలిక మృతదేహం అతని ఇంట్లోని బాత్రూమ్‌లోకి ఎలా వచ్చిందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.మరోవైపు, ఇది ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెద్దపులుల వేషాలను చూసి భయపడిన బాలిక, ఆ ఇంట్లోకి వెళ్లి బాత్రూమ్‌లో దాక్కుందా? ఆ సమయంలో ప్రమాదవశాత్తు నల్లాపై పడి మెడకు గాయమైందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## పాకిస్థాన్‌కు మైక్రోసాఫ్ట్ గుడ్‌బై

**(1వపేజీ తరువాయి)**వెల్లడించారు. ఇక పాకిస్థాన్ లో ఇబ్బందులు తట్టుకోలేక చాలా సంస్థలు తమ ఆస్తులను స్థానిక సంస్థలకు అమ్ముకుని వెళ్లిపోయాయి. ఈ లిస్టులో ఉబర్, ఫైజర్, షెల్, ఎలీ ఎల్లీ, సోనోఫి, టెలినార్, లొటే కెమికల్స్ ఉన్నాయి. తాజాగా ఈ లిస్టులో మైక్రోసాఫ్ట్ కూడా చేరింది. ప్రస్తుతం పాక్ లో సైన్యం పెత్తనం పెరగడం, ఉద్రిక్తతలు, విధ్వంసం, రాజకీయ అస్థిరత, యుద్ధాలు, ప్రభుత్వ నియంత్రణ, అనిశ్చితి, అస్థిర వాతావరణం.. ఇలా చాలా కారణాలతో అక్కడి ఎమ్ఎన్‌సీ కంపెనీలు బయటకు వచ్చేస్తున్నాయి.

## తెలంగాణ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు

**(1వపేజీ తరువాయి)**సైకిళ్లను అదనంగా పంపిణీ చేయనున్నారు. అలాగే హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50 మంది విద్యార్థులకు చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. ఇక ఒక్కో గ్రామ పంచాయతీలో 10 నుండి 25 సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. అయితే తొలి దశలో 5 వేల సైకిళ్లను ఈనెల 8 వ తేదీన పంపిణీ చేసేందుకు బండి సంజయ్ టీమ్ సిద్ధమైనట్లు సమాచారం. ఇక ఒక్కో సైకిల్ ను రూ.4 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సైకిల్ రాడ్ కు ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇంకోవైపు బండి సంజయ్ ఫోటోను ముద్రించనున్నారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో అధికంగా పేద, మధ్యతరగతి వర్గానికి చెందినవారే ఉంటారు. ఇంటి నుండి స్కూల్ కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతుంటారు. ఆటోలు, బస్సుల్లో వెళ్లే స్తోమత ఉండదు. ఇక టెన్త్ క్లాస్ విద్యార్థులకు స్కూల్ అయిపోయాక స్పెషల్ క్లాసులు అని ఉంటాయి. దీంతో ఎక్కువ సమయం స్కూల్ లోనే ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో విద్యార్థులకు సైకిళ్లను అందించాలని బండి సంజయ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## మహిళలకు గుడ్‌న్యూస్


**(1వపేజీ తరువాయి)**ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త, పాత అపార్ట్‌మెంట్లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉంటుందని, పాతవాటి రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకుని స్టాంప్? డ్యూటీ తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పాత అపార్ట్‌మెంట్ల స్టాంప్ డ్యూటీ తగ్గింపు అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.వారందరికి అవకాశం : గ్రామ పాలన అధికారుల(జీపీవో) ఎంపికకు పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు మరో అవకాశం కల్పించనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ సంఘాలతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితర సంఘాల నాయకులు హాజరై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఇటీవల నిర్వహించిన పరీక్షతో 3,454 మంది జీపీవోలుగా అర్హత సాధించారని తెలిపారు. రెవెన్యూ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్ఏ, వీఆర్వోలకు మరో అవకాశమిచ్చి అర్హత పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవసరమైతే వీఆర్ఏల నుంచి జూనియర్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరించిన వారిని జీపీవో పోస్టుల వైపు మళ్లించడాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. శాఖలో పదోన్నతులు, ఇతర అంశాలపై సంఘాల నాయకులు మంత్రి పొంగులేటికి వినతిపత్రాలు ఇచ్చారు.సహాయక సంఘాలకు మహిళా స్వయం ఉపాధి అవకాశాలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలు మహిళలకు ఉపాధి కల్పించే దిశగా మెప్మా అడుగులు వేస్తుంది. స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా వృద్ధి చెందేలా టైలరింగ్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో 3 టైలరింగ్ హబ్‌లు ప్రతిపాదించారు. త్వరలోనే స్థలాలు ఖరారు చేసి పనులు మొదలుపెట్టనున్నారు.

## చరిత్ర తిరగరాసిన టీమిండియా

**(1వపేజీ తరువాయి)**నడ్డివిరిచాడు. జెమీ స్మిత్(88) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది. సిరాజ్, సుందర్, జడేజా, ప్రసిద్ధ్ ఒక్కో వికెట్ తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ కాస్తా ప్రస్తుతం 1-1తో సమమైంది. డబుల్ సెంచరీకి తోడు మరో సెంచరీతో కదంతొక్కిన కెప్టెన్ గిల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు ఈనెల 10 నుంచి లార్డ్స్‌లో మొదలుకానుంది.

ఆకాశ్‌దీప్ అదుర్స్ : బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన ఆకాశ్‌దీప్ అంచనాలకు మించి రాణించాడు. వర్షం కారణంగా గంట విరామం తర్వాత మొదలైన ఐదో రోజు ఆటలో ఆకాశ్‌దీప్‌దే హవా. తన స్వింగ్ బౌలింగ్‌తో ఆకాశ్‌దీప్..ఇంగ్లండ్ టాపార్డర్ బ్యాటర్లకు చుక్కలుచూపెట్టాడు. బంతిని ఇరు వైపులా స్వింగ్ చేస్తూ వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్‌దీప్ విసిరిన బంతిని సరిగ్గా అర్థం చేసుకోని పోప్(24) వికెట్ల మీదకు ఆడుకుని నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. ఇక్కడే ఇంగ్లండ్ పతనానికి ఆకాశ్ తెరతీశాడు. మరో ఓవర్ తేడాతో ప్రమాదకర బ్రూక్(23)ను వికెట్ల ముందు ఆకాశ్ దొరకబుచ్చుకున్నాడు. షాట్ ఆడే క్రమంలో లైన్ మిస్సయిన బ్రూక్ ఐదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ స్టోక్స్..స్మిత్‌కు జతకలిశాడు. వీరిద్దరు..భారత బౌలర్లను నిలువరించే ప్రయత్నం చేశారు. వికెట్లనుక కాపాడుకుంటూ అనవసర షాట్లకు పోకుండా అడపాదడపా బౌండరీలతో స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న స్మిత్ పరిణతి కనబరిచాడు.

వీరద్దరు క్రీజులో కుదురుకుంటారనుకున్న తరుణంలో గిల్ వేసిన ప్లాన్ వర్క్‌ఔట్ అయ్యింది. సరిగ్గా లంచ్‌కు ముందు సుందర్ బౌలింగ్‌లో స్టోక్స్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. డీఆర్ఎస్‌కు వెళ్లినా స్టోక్స్‌కు నిరాశ తప్పలేదు. దీంతో లంచ్ సమయానికి ఇంగ్లండ్ 153/6 స్కోరుతో ఉంది. భారత విజయానికి మిగిలింది నాలుగు వికెట్లే. ఈ క్రమంలో స్మిత్..వోక్స్‌తో కలిసి పోరాడే ప్రయత్నం చేశాడు. లక్ష్యం భారీగా ఉండటం చేతిలో వికెట్లు లేకపోవడం ఇంగ్లండ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. దీనికి తోడు బ్యాటర్లకు తగ్గట్లు కెప్టెన్ గిల్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించడం టీమ్‌ఇండియాకు లాభించింది. అయితే అర్ధసెంచరీ మార్క్ అందుకున్న స్మిత్‌తో కలిసి దూకుడుగా ఆడే ప్రయత్నంలో వోక్స్‌ను ప్రసిద్ధ్ ఔట్ చేశాడు. ఇదే క్రమంలో వోక్స్‌ను అనుసరిస్తూ ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో స్మిత్..సుందర్‌ను క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆఖర్లో బ్రెండన్ కార్స్(38) దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆకాశ్‌దీప్ వేసిన బౌన్సర్‌ను ఆడే క్రమంలో గిల్ క్యాచ్‌తో కార్స్ ఔట్ కావడంతో భారత్ గెలుపు సంబురాల్లో మునిగిపోయింది.



## స్టాలిన్ పోరాటం వేరు..మాది పరిమితమైన హిందీ వ్యతిరేకతే



ముంబై- నవభూమి:ఇరవై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఠాక్రే సోదరులు ఉద్ధవ్, రాజ్ తొలిసారి మరాఠీ విజయోత్సవ వేడుకల్లో వేదికను పంచుకోవడం అందరిలోనూ ఆసక్తిని కలిగించింది. మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరగున్నాయనే సంకేతాలను ఠాక్రే సోదరుల వ్యాఖ్యలు అందించాయి. ఇదే సమయంలో భాషాపరమైన హక్కుల కోసం డీఎంకే చేస్తున్న పోరాటం రాష్ట్రాల ఎల్లలు దాటి మహారాష్ట్రలో నిరసనల ప్రకంపనలు సృష్టించాయంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఠాక్రే సోదరులను అభినందించారు. దీనిపై ఉద్ధవ్ శివసేన తాజాగా స్పందించింది. హిందీ అంశంపై తమ వైఖరి, తమిళనాడు సీఎం వైఖరి వేర్వేరని, తాము హిందీకి వ్యతిరేకం కాదని, తమ వ్యతిరేకత పరిమితమైనదని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ తెలిపారు.'హిందీపై వారి (డీఎంకే) వ్యతిరేకత వేరు. హిందీ మాట్లాడం, ఎవరినీ మాట్లాడనీయమనే విధానం వారిది. కానీ ఇక్కడ మహారాష్ట్రలో అది మా విధానం కాదు. మేము హిందీ మాట్లాడతాం. కానీ ప్రాథమిక పాఠశాలల్లో హిందీని బలవంతంగా రుద్దడానికి మేము వ్యతిరేకం. మా పోరాటం ఇంతవరకే పరిమితం' అని సంజయ్ రౌత్ చెప్పారు. హిందీ మాట్లాడకుండా తాము ఎవరినీ అడ్డుకోమని, తమకు హిందీ సినిమాలు, హిందీ థియేటర్లు, హిందీ మ్యూజిక్ ఇక్కడ ఉన్నాయని రౌత్ వివరించారు. కేవలం ప్రైమరీ పాఠశాలల్లో హిందీని బలవంతంగా రుద్దరాదన్నదే తమ పోరాటమని చెప్పారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
సోమవారం
07 । జులై । 2025

## ఆస్తి కోసం అత్తను చంపిన కోడలు.. భర్త సోదరులతో వివాహేతర సంబంధం



లక్నో-నవభూమి: ఒక మహిళ ఆస్తి కోసం తన అత్తను చంపింది. ఆమె నగలను చోరీ చేసింది. మహిళ సోదరి, ఆమె ప్రియుడు దీనికి సహకరించారు. ఈ హత్యపై దర్యాప్తు చేసిన పోలీసులు షాక్ అయ్యారు. అత్తను చంపిన కోడలికి ఆమె భర్త సోదరులతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 24న కుంహారియా గ్రామానికి చెందిన 54 ఏళ్ల సుశీలా దేవి ఆమె ఇంట్లో అనుమానాస్పదంగా మరణించింది. రూ.8 లక్షల విలువైన ఆమె నగలు చోరీ అయ్యాయి.కాగా, కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోడలైన పూజ తన సోదరి కమల, ఆమె ప్రియుడు అనిల్ వర్మతో కలిసి అత్త సుశీలా దేవిని హత్య చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో పూజ, ఆమె సోదరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న అనిల్ నగలు అమ్మేందుకు ప్రయత్నించగా ఎన్‌కౌంటర్ చేసి పట్టుకున్నారు. చోరీ చేసిన నగలు, తుపాకీ, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు ఉమ్మడి భూమిలోని తన వాటా అమ్మి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు వెళ్లాలని పూజ భావించిందని పోలీస్ అధికారి తెలిపారు. అత్త సుశీలా దేవి అభ్యంతరం చెప్పడంతో ఆమె అడ్డు తొలగించుకునేందుకు సోదరి, ఆమె ప్రియుడితో కలిసి హత్య చేసిందని చెప్పారు.కాగా, పూజ భర్త మరణించడంతో ఝాన్సీలో ఉన్న మరిది కళ్యాణ్ సింగ్‌తో సహజీవనం చేసిందని పోలీస్ అధికారి తెలిపారు. ఆరేళ్ల కిందట అతడు చనిపోగా మరో మరిది సంతోష్‌తో కూడా సంబంధాన్ని ఆమె కొనసాగించిందని చెప్పారు. అతడి ద్వారా ఆడ పిల్లను కన్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో తొమ్మిది నెలల కిందట సంతోష్ భార్య తన పుట్టింటికి వెళ్లిందని చెప్పారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## పంచవటిలో గోదారమ్మ ఉధృత ప్రవాహం..



ముంబై- నవభూమి:మహారాష్ట్రలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నాసిక్ పట్టణంలో గోదారమ్మ పరవళ్లు తొక్కుతోంది. వర్షాల కారణంగా వరద నీరు చేరడంతో ఉప్పొంగి పరుగులు తీస్తోంది. పట్టణంలోని పంచవటి లో రామాలయం పాక్షికంగా మునిగిపోయింది.పంచవటిలో అత్యంత పురాతనమైన లక్ష్మణ సమేత సీతారాముల ఆలయం ఉంది. పురాతన కాలంలో రాముడు, సీత, లక్ష్మణుడు ఆ ప్రాంతంలో పర్ణశాలను ఏర్పాటు చేసుకున్నారని, అగస్త్య ముని సలహా మేరకు వారు అక్కడ ఆవాసం ఏర్పరుచుకున్నారని పురాణాలు చెబుతున్నాయి. పంచవటిలోని రామాలయం గోదావరిలో పాక్షికంగా మునిగిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

## 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా



బిహార్ -నవభూమి:బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలంటూ ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలను ఆమె సవాల్ చేశారు. రాజ్యాంగంలోని పలు నిబంధనలు ఉల్లంఘిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోందని.. జూన్ 24న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఆమె పిటిషన్‌లో అభ్యర్థించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దాఖలు రిట్ పిటిషన్ దాఖలు చేరసినట్లు పేర్కొన్నారు. బిహార్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ జరుగుతోందని.. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1), 21, 325, 328, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 ఎన్నికల నమోదు నియమాలు, 1960లోని నిబంధనలను ఉల్లంఘించినట్లేనన్నారు.ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే దేశంలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను దెబ్బతిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిహార్‌తో పాటు బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయడాన్ని నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని మహువా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నా.. గతంలో అనేకసార్లు ఓటు వేసిన ఓటర్లంతా తమ అర్హతను నిరూపించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంటుందని.. ఇది ఆర్టికల్ 326కి విరుద్ధమని పేర్కొన్నారు. ఆమె తరఫున న్యాయవాది నేహా రతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాల్ చేస్తూ ఏడీఆర్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది.

## అదుపుతప్పి కొండ పైనుంచి ఫల్టీలు కొట్టిన కారు.. నలుగురు దుర్మరణం

న్యూఢిల్లీ-నవభూమి: కారు అదుపుతప్పి కొండ పైనుంచి ఫల్టీలు కొట్టిన ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌రాష్ట్రం కులూ జిల్లా లోని రోహ్‌తాంగ్ పాస్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రహ్నీనలా సమీపంలోని పర్వతం పైనుంచి కారు ఫల్టీలు కొడుతూ కిందకు పడిపోయింది.కారులో మొత్తం ఐదుగురు ఉండగా ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందిన వెంటనే మనాలీ పోలీసులు, రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతులు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

# వెలుగులోకి ధర్మస్థలలో దారుణ హత్యలు



బెంగళూరు-నవభూమి:కర్ణాటకలోని ప్రముఖ ధర్మస్థల ఆలయ ప్రాంతంలో హత్యల అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆలయ ప్రాంగణంలో 1995 నుంచి 2014 వరకు పని చేసిన మాజీ పారిశుద్ధ్య కార్మికుడు.. వందల సంఖ్యలో శవాలను తానే పాతిపెట్టానని, బలవంతంగా చనిపోయిన మహిళలను తనచేతులతోనే డీజిల్‌తో తగలబెట్టానని పేర్కొంటూ పోలీసులకు రాసిన లేఖ కలకలం రేపుతోంది ఈ లేఖ ఆధారంగా ధర్మస్థల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. అతడి లేఖతో ధర్మస్థల ఆలయ పరిసరాల్లో దశాబ్దాల కిందట జరిగిన అనేక హత్యలు వెలుగులోకి వస్తున్నాయి. న్యాయవాదులు ఓజస్వి గౌడ, సచిన్ దేశ్‌పాండేల ద్వారా ఈ లేఖను పోలీసులకు అందించారు.1995%-%2014 మధ్య కాలంలో ధర్మస్థల గ్రామ పరిసరాల్లో అనేక హత్యలు జరిగినట్లు, వాటిని తానే స్వయంగా చూడగా, మరికొన్నింటిలో తనతో బలవంతంగా శవాలను పాతిపెట్టించారని అతడు ఆరోపించాడు. 1998లో ఈ విషయంలో పోలీసులకు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నిస్తే ఉన్నతాధికారి తనను కొట్టి.. చంపేస్తానని బెదిరించాడని ఆరోపణలు చేశాడు. కొందర్ని డీజిల్‌తో కాల్చి, ఇంకొన్ని శవాలను ధర్మస్థల పరిసరాల్లో పాతిపెట్టాల్సి వచ్చిందని చెప్పాడు. అంతేకాదు, తాను పాతిపెట్టిన శవాల్లో మైనర్ బాలికలు, అమ్మాయిలే ఉన్నారని తెలిపాడు. వాళ్లను లైంగికంగా హింసించి, ఊపిరాడకుండా గొంతునులిమి చంపినట్లు కనిపించిందని అతడు అనుమానం వ్యక్తం చేశాడు. "వందలాది శవాలను పాతిపెట్టాను, వాటికి గౌరవంతో అంత్యక్రియలు జరగలేదు. ఇప్పుడు నాకు మానసికంగా పాతకంగా ఉంది. కనీసం ఇప్పటికైనా ఆ శవాలకు గౌరవంగా అంత్యక్రియలు జరగాలి" అని లేఖలో పేర్కొన్నాడు. 2014లో తన కుటుంబానికి చెందిన బాలికపై లైంగిక వేధింపుల నేపథ్యంలో ప్రాణభయంతో ఆ ప్రాంతం విడిచిపెట్టాల్సి వచ్చింది.. అప్పటి నుంచి వేరే రాష్ట్రంలో తలదాచుకుంటున్నానని వివరించాడు. ఇప్పుడు పశ్చాత్తాపంతో తన పాపం ఒప్పుకొని బయటకు వచ్చానని చెబుతున్నాడు. 'బలమైన వ్యక్తులే ఈ హత్యలకు కారణం. నా కుటుంబానికి రక్షణ కల్పిస్తే, వారి పేర్లను వెల్లడిస్తాను' అని అతడు పేర్కొన్నారు. కాగా, లేఖపై స్పందించిన పోలీసులు.. పూర్తిస్థాయిలో విచారణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లేఖలో పేర్కొన్న చోట్ల శవాల ఉనికిని పరిశీలించి, కోర్టు అనుమతితో తవ్వకాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఇక, మాజీ పారిశుద్ధ్య కార్మికుడికి భారతీయ సాక్ష్యాధినియమం ప్రకారం రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నట్లు న్యాయవాదులు పేర్కొంటున్నారు.ఈ లేఖ ధర్మస్థల ఆలయ పరిసరాల్లో జరిగిన ఘోరమైన హత్యల చరిత్రకి ఓ ఉదాహరణగా మారుతోంది. ఆలయ పరిసరాల్లో భద్రతా వ్యవస్థలు, పౌర హక్కులు, శవాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడంపై బహిరంగ చర్చ జరుగుతోంది. దీనిపై లోతైన దర్యాప్తు జరిగితే నిజనిజాలు బయటపడే అవకాశం ఉంది. 'ఘటనల వివరాలు తేలేవరకు దర్యాప్తును త్వరితగతిన కొనసాగించాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### లండన్ నుంచి చేరుకున్న ఇంజినీర్ల బృందం..


## F 35B ఫైటర్ జెట్ ఎయిర్‌లిఫ్ట్‌కు రెడీ



గత మూడు వారాలుగా తిరువనంతపురం విమానాశ్రయంలో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఎఫ్-35బి యుద్ధ విమానాన్ని రిపేర్ చేయడానికి, తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం యునైటెట్ కింగ్‌డమ్ నుంచి 24 మంది ఇంజినీర్ల బృందం ప్రత్యేక విమానంలో ఆదివారం కేరళకు చేరుకుంది. అత్యంత భద్రత మధ్య ఉన్న ఈ విమానానికి మరమ్మత్తులు చేయనున్నారు. రాయల్ ఎయిర్ ఫోర్స్ విమానంలో ఏవియేషన్ ఇంజినీర్లు ప్రత్యేక పరికరాలతో ల్యాండయ్యారు. అనంతరం విమానానికి అవసరమైన మరమ్మతులు చేయడానికి హ్యాంగర్‌కు తరలించారు. దీనిని సీ-17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో తరలించాలని యోచిస్తున్నారు. అవసరమైన మరమ్మతులు, భద్రతా తనిఖీల తర్వాత విమానం తిరిగి సేవలను ప్రారంభిస్తుందని బ్రిటిష్ హైకమిషన్ అధికారి వెల్లడించారు. దీనివల్ల ఇతర విమానాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు. కేరళ విమానాశ్రయంలో ఉన్న ఫైటర్ జెట్‌కు భారీ భద్రత కల్పించారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది దీనికి కాపలాగా ఉన్నారు. ఈ విమానం గత నెలలో భారత్-యూకే సంయుక్త నేవీ విన్యాసాల్లో పాల్గొంది. ఆ సమయంలో సాంకేతిక సమస్య రావడంతో జూన్ 14న తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ఎఫ్ 35 బి జెట్‌ను ల్యాండ్ చేశారు. మొదట్లో ప్రతికూల వాతావరణం, ఇంధనం లేకపోవడం వల్ల అత్యవసరంగా దించారని చెప్పారు.కానీ, ఆ తర్వాత ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉందని యూకే అధికారులు తెలిపారు. మరమ్మతుల కోసం అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతో అప్పటి నుంచి ఈ భారీ యుద్ధ విమానం ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయింది. అయితే, విమానం హ్యాంగర్ పార్కింగ్ కోసం ఎయిరిండియా ఇచ్చిన ఆఫర్‌ను యూకే రాయల్ నేవీ తిరస్కరించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద యుద్ధ విమానంగా ఎఫ్-35 నిలిచింది. అమెరికా తయారుచేసిన ఈ ఫైటర్ జెట్‌లో అత్యాధునిక వ్యవస్థలు ఉన్నాయి. ఈ సాంకేతికత ఇతరులకు తెలియకూడదనే ఉద్దేశంతోనే హ్యాంగర్‌కు తరలించడానికి నిరాకరించింది. అటు, ఈ యుద్ధ విమానం ఫోటోను ఓఎల్‌ఎక్స్‌లో ఉంచి.. అమ్మకానికి పెట్టినట్టు ఫన్నీగా పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.

కాగా, మే 2019లో మొదటిసారి ఎఫ్-35బిను ఫ్లోరిడా నుంచి సీ-17 గ్లోబ్‌మాస్టర్‌లోనే తరలించారు. ఈ అపూర్వమైన రక్షణ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయింది. అత్యాధునిక సాంకేతికత కలిగిన F-35 లైట్‌నింగ్ I స్టెల్త్ యుద్ధవిమానం రెక్కలను తొలిసారిగా వేరుచేసి విమాన రవాణా చేశారు.. ఈ మిషన్‌లో C-17 గ్లోబ్‌మాస్టర్ ఎయిర్‌లిఫ్ట్ వాహనంగా పనిచేసింది. విమానం ఫ్లోరిడాలోని ఎగ్లిన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి ఉటాలోని హిల్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌కు తరలించారు.ఈ మిషన్ సాధారణమైంది కాదు. నాలుగేళ్లుగా ప్రణాళికతో సాగిన 200,000 డాలర్లు విలువైన ప్రాజెక్ట్. ఎఫ్-35 విమానం కీలక స్టెల్త్ టెక్నాలజీ కారణంగా ప్రతి భాగం అత్యంత జాగ్రత్తతో విచ్ఛిన్నం చేశారు.

## భారత్‌లో రాయిటర్స్ ట్విట్టర్ అకౌంట్ బ్లాక్



న్యూఢిల్లీ-నవభూమి:ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ సోషల్ మీడియా ఖాతా ఎక్స్ (ట్విట్టర్) ప్రస్తుతం భారత్‌లో యాక్సెస్ చేయలేని స్థితిలో ఉంది. అయితే ఈ చర్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర సమాచార శాఖ ప్రకటించింది. "రాయిటర్స్‌ను బ్లాక్ చేయాల్సిన ఎలాంటి అవసరం భారత్ ప్రభుత్వానికి లేదు. మేము ఎక్స్ ప్లాట్‌ఫామ్‌తో కలిసి ఈ సమస్యను పరిష్కరించే పనిలో ఉన్నాం" అని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. అయితే, రాయిటర్స్ ఎక్స్ ఖాతాను తెరవగానే "న్యాయపరమైన చర్యలతో భారత్‌లో ఈ అకౌంట్‌ను విత్‌హెల్డ్‌లో ఉంచడం జరిగింది" అనే మెసేజ్ వస్తోంది. కానీ, ఆ లీగల్ డిమాండ్ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చింది కాదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొంది.

ఆలస్యంగా అమలైన పాత ఆదేశమా?

పీటీఐ నివేదిక ప్రకారం, మే 7న కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సింధూర్' సమయంలో కొన్ని సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని ట్విట్టర్‌ను ఆదేశించింది. అయితే ఆ సమయంలో రాయిటర్స్ ఖాతాపై ఎలాంటి చర్య తీసుకోలేదని, ఇప్పుడు ఆ ఆదేశాన్ని ఆలస్యంగా అమలు చేసి ఉండొచ్చని, ఇది ప్లాట్‌ఫామ్ వైపు నుంచి జరిగిన పొరపాటు కావచ్చని పేర్కొంది.

బ్లాక్ అయిన ఖాతాలు..రాయిటర్స్ , రాయిటర్స్ వరల్డ్ వంటి అకౌంట్లు బ్లాక్ అయ్యాయి. కానీ, రాయిటర్స్ ఆసియా( రాయిటర్స్‌టెక్ రాయిటర్స్ ఫ్యాక్ట్‌చెక్ ) వంటి ఇతర ఖాతాలు మాత్రం ప్రభావితం కాలేదు, అవి యధావిధిగా భారత్‌లో యాక్సెసబుల్‌గా ఉన్నాయి. కాగా, ఇప్పటివరకు రాయిటర్స్ సంస్థ దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. యూకేకు చెందిన ఈ వార్తా సంస్థ ఎందుకు బ్లాక్ చేశారు? ఇది తాత్కాలికమేనా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.ట్విట్టర్ సేఫ్టీ పాలసీ ప్రకారం 'ఆయా దేశాల్లోని చట్టాల ప్రకారం లేదా కోర్టు ఉత్తర్వుల మేరకు అకౌంట్లు లేదా పోస్టులు తాత్కాలికంగా నిలిపివేయవచ్చు'. కాగా, సంస్థను సంప్రదించిన కేంద్రం.. ఎందుకు ఇలా జరిగిందో వివరణ కోరింది. రాయిటర్స్ ఖాతా పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఈ పరిణామం మీడియా స్వేచ్ఛ, సామాజిక మాధ్యమాల నిబంధనలపై ఆసక్తికరమైన చర్చకు దారితీసే అవకాశం ఉంది.కాగా, ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా మీడియా తప్పుడు కథనాలు ప్రచురించడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై నిరసన తెలిపిన భారత్.. దేశంలోకి చైనా గ్లోబల్ టైమ్స్ ఖాతాలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే.

### నాకు 130 ఏళ్ల వరకూ బతకాలని ఆశ..

## దీర్ఘాయుష్షు కోసం దలైలామా ఆకాంక్ష తీరేనా?



న్యూఢిల్లీ-నవభూమి:తన వారసుడి విషయంలో తీవ్ర చర్చ జరుగుతోన్న వేళ ప్రముఖ ఆధ్యాత్మిక నేత, బౌద్ధుల గురువు దలైలామా మరోసారి తన దీర్ఘాయుష్కు ఆకాంక్షను వెల్లడించారు. సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ (%జూూ%) ఆధ్వర్యంలో దలైలామా 90వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధర్మశాలలోని బౌద్ధుల ఆలయంలో శనివారం నిర్వహించిన 'దీర్ఘాయుష్క ప్రార్థన సభ'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దలైలామా మాట్లాడుతూ.. "ఇప్పటి వరకు బౌద్ధ ధర్మం కోసం, టిబెట్ ప్రజల కోసం నేను బాగా సేవలందించానని నమ్ముతున్నాను... ఇంకా మరో 30 లేదా 40 ఏళ్లు అంటే 130 ఏళ్లకుపైగా బతకాలని ఆశగా ఉంది.. " అని అన్నారు. ఇక, తన వయస్సుపై అప్పుడప్పుడు జోకుల వేసే దలైలామా, గతంలోనూ పలు సందర్భాల్లో వేర్వేరు గణాంకాలు చెప్పారు. డిసెంబర్ 2024లో '110 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ' బతుకుతానని పేర్కొనగా.. అంతకు ముందు ఐదేళ్ల కిందట - "113 ఏళ్లు జీవిస్తాను' అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండు, లోక్‌సభ ఎంపీ టపిర్ గావ్ తదితరులు పాల్గొన్నారు. సీటీఐ అధ్యక్షుడు పెన్పా త్సెరింగ్ మాట్లాడుతూ.. 'దలైలామా ఏం మాట్లాడినా దానిని అన్వయించుకోవడం చాలా కష్టమే... కానీ ఆయన చెప్పిన ప్రతి మాటను మేం విశ్వసిస్తాం' అని అన్నారు. దలైలామా వారసుడి ఎంపిక విషయంలో బంగారు కలశం విధానం పాటించాలని చైనా డిమాండ్ చేస్తోన్న విషయం తెలిసిందే.'ఇవాళ దేవతలు, దైవ ప్రతినిధులు, మానవులు అందరూ కలిసి నా దీర్ఘాయుష్క కోసం మంగళా శాసనాలు చేస్తున్నారు. మీరు ఎంతో భక్తితో ప్రార్థనలు చేస్తున్నారు" అని దలైలామా అభినందించారు. మావో జెడాంగ్‌ను కలుసుకున్న సందర్భాన్ని గుర్తు చేసిన ఆయన.. మావో 'మతం ఓ విషం' అన్న మాటను గుర్తు చేశారు. అలాగే భారత మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూను కలిసిన అనుభవాలను కూడా ఆయన పంచుకున్నారు. మరోవైపు, దలైలామా వారసుడి విషయంలో భారత్‌కు చైనా హెచ్చరికలు చేయడం గమనార్హం.'నేను కేవలం సాధారణ బౌద్ధ సన్యాసి మాత్రమే' అని పేర్కొన్న ఆయన.. జన్మదిన వేడుకలను తాను జరుపుకోకపోయినా, అవి దయ, సహనం, బోధిచిత్తాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో జరిగితే ఆనందంగా ఉంటుందని తెలిపారు. "నా 90వ పుట్టినరోజు సందర్భంగా టిబెటియన్ సముదాయాలతో పాటు, ప్రపంచంలోని అనేక ప్రదేశాల్లో స్నేహితులు, మిత్రులు సంబరాలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్నాను. దయ, మానవీయత, నిరుపయోగ ధార్మికతను ప్రచారం చేసే కార్యక్రమాలుగా ఇవి మారడం నాకు ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు.

"భౌతిక అభివృద్ధి కోసం ప్రయత్నించడం అవసరం అయినప్పటికీ, నిజమైన ప్రశాంతత మనస్సులోనే ఉంటుంది. దయా గుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా కేవలం కుటుంబ సభ్యులపట్ల కాదు, ప్రపంచంలోని ప్రతివారిపట్ల కూడా మానవతా విలువలు పెరుగుతాయి.

## రైలు పట్టాలపై ఆటో నడిపిన వ్యక్తి.. తర్వాత ఏం జరిగిందంటే?



పాట్నా-నవభూమి:మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి రైలు పట్టాలపై ఆటో నడిపాడు మరో ట్రాక్‌పై రైలు వస్తున్నది. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. ఆటో డ్రైవర్‌ను అడ్డుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మద్యంపై నిషేధం ఉన్న బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం సీతామర్హిలోని మెహసౌల్ ప్రాంతంలో రైలు పట్టాల వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆటోను నేరుగా రైలు పట్టాలపై నడిపాడు. కొంత దూరంలో మరో ట్రాక్‌పై రైలు వస్తున్నది.కాగా, ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే అప్రమత్తమయ్యారు. రైలు పట్టాలపై వెళ్తున్న ఆటోను అడ్డుకున్నారు. ఒంటిపై చొక్కాలేని డ్రైవర్ మద్యం మత్తులో ఆటో నుంచి కిందకు దిగి దాని చుట్టూ తిరిగాడు. స్థానికులు అతడ్ని నిలువరించారు. రైలు పట్టాలపై ఉన్న ఆటోను పక్కకు తొలగించారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## బీజేపీ, నితీశ్‌కుమార్ బీహార్‌ను నేరాలకు అడ్డాగా మార్చారు : రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ-నవభూమి: బీజేపీ పైనా, బీహార్ లోని నితీశ్ కుమాం ప్రభుత్వంపైనా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీహార్ రాజధాని పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యపై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. నితీశ్ కుమార్, బీజేపీ కలిసి రాష్ట్రాన్ని గూండాల రాజ్యంగా మార్చాయని మండిపడ్డారు.

ఇప్పుడు బీహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో ఉందని, రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయిందని రాహుల్‌గాంధీ విమర్శించారు. నేరాలను నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్ర పౌరులను రక్షించలేని పార్టీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలెవరూ ఓటు వేయొద్దని సూచించారు. దారుణాలను, దోపిడీలను పూర్తిగా నిర్మూలించి, పురోగతివైపు అడుగులు వేసే సమయం బీహార్‌కు వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేసే ఓట్లు కేవలం ప్రభుత్వ మార్పు కోసమేగాక రాష్ట్రాన్ని రక్షించడానికి ఉపయోగపడతాయనే విషయాన్ని ప్రజలు దృష్టిలో పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.కాగా పట్నాలోని గాంధీమైదాన్ ఠాణా పరిధిలోగల రామ్‌గులాం చౌక్ పనాష్ హోటల్ సమీపంలో గోపాల్ ఖేమ్కా దారుణహత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఖేమ్కా అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ హత్య బీహార్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ స్పందించారు. దుండగులు గోపాల్ ఖేమ్కాను పట్నా నడిబొడ్డున హత్యచేస్తే.. అక్కడికి పోలీసులు చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టిందని విమర్శించారు. ఆరేళ్ల క్రితం వ్యాపారవేత్త ఖేమ్కా కుమారుడిని ఇదేవిధంగా హత్యచేస్తే ఇప్పటికీ ఆ హంతకులను అరెస్టు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతున్న వర్షాలు.. 75కు పెరిగిన మరణాలు



హిమాచల్ ప్రదేశ్ -నవభూమి:హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో వరుణ బీభత్సం ఇంకా కొనసాగుతోంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 75కు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం, మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా మారింది. చాలాచోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది.రాష్ట్రవ్యాప్తంగా 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక్కరోజులో 115-204 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అంటే అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని ఐఎండీ హెచ్చరించింది. బిలాస్‌పూర్, హమీర్‌పూర్, చంబా, సిమ్లా, కులూ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. ఐటీబీపీ దళాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి.దీనికితోడు బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ సాయం తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రభుత్వానికి సూచించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | సోమవారం | 07 । జులై । 2025





## అత్యంత బాధాకరం.. నలిగిపోయి, విగతజీవులుగా మారుతున్నారు



ముంబై-నవభూమి: ఒళ్లు గగుర్పొడిచే నిజాలు బయటకి వచ్చాయి. అయితే, ఇవన్నీ నివారించగలిగే అపాయాలే కావడం మరింత బాధాకరం. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ముంబై లోకల్ ట్రైన్స్ ప్రమాదాల్లో చనిపోయిన వారెంతమందో తెలుసా.. అక్షరాలా 922 మంది. ముంబైలో కేవలం 5 నెలల్లో 922 మంది ప్రయాణికులు తమ అమూల్యమైన ప్రాణాల్ని కోల్పోయారు. వీటిలో 210 మంది నడుస్తున్న రైళ్ల నుంచి కింద పడి మరణించారు. జనవరి 1 – మే 31, 2025 మధ్య ముంబైలో స్థానిక రైలు ప్రయాణికులు ఇలా ప్రాణాలు కోల్పోయారని లెక్కలు చెబుతున్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన సమాధానం ప్రకారం.. ముంబై రైల్వే పోలీస్ కమిషనరేట్ ఇచ్చిన తాజా లెక్కలివి. నగర జీవనాధారంగా చెప్పబడే ముంబై సబర్బన్ రైల్వే నెట్‌వర్క్‌లో కొనసాగుతున్న భద్రతా సంక్షోభానికి భయంకరమైన గుర్తులుగా వీటిని చెప్పుకోవాల్సిన పరిస్థితి. ప్రతీ రోజూ ఉండే రైల్వే ప్రయాణికుల రద్దీ, బోగీల సంఖ్య తక్కువగా ఉండటం, ప్లాట్‌ఫామ్స్ మీద భద్రతా చర్యలు లేకపోవడం వల్ల లక్షలాది మంది రోజువారీ ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు.. ఇది ప్రజారోగ్యం, ఇంకా భద్రతా అత్యవసర పరిస్థితిని సూచిస్తోందని .. నగరానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త అజయ్ బోస్ అంటున్నారు. నివారించగల కారణాలతో మనం దాదాపు ప్రతిరోజూ ప్రాణాలు కోల్పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## మన్యం అగ్నికణం అల్లూరి సీతారామరాజు

విప్లవం పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే పేరు అల్లూరి సీతారామరాజు. తెలుగు జాతి గర్వించదగిన విప్లవ వీరుడు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వణికించిన ఉద్యమ నాయకుడు. ఆయన జీవితం ధైర్యానికి, త్యాగానికి, నిస్వార్థ పోరాటానికి నిలువెత్తు ఉదాహరణ. 19వ శతాబ్దాంతం, 20వ శతాబ్దపు ఆరంభం... భారత స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తుగా మండి పోతున్న దక్షిణ భారతంలో, ప్రత్యేకంగా మన్యం ప్రాంతాల్లో అల్లూరి విజ్ఞాన దీప్తిని రగిలించారు. తెల్లదొరల అణచివేతకు, దళారుల దౌర్జన్యానికి, ఆదివాసీలను శోషించే వ్యవస్థకు వ్యతిరేకంగా, కేవలం 27 ఏళ్ల యువకుడిగా సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన అల్లూరి, తెలుగునాడుకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన పేరు చెబితే మన్యం పులకిస్తుంది. పశ్చిమ గోదావరి అడవుల్లో వెలిసిన విప్లవ దీప్తి ఆయన. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రజలు స్వయంగా ఆయన్ని దేవతలా భావించారు. అల్లూరి తన ఉద్యమానికి ఆశయాన్ని తన జీవితమేగా మార్చుకున్నారు. అడవిలోని గిరిజనులు, అనాధలు, నిరుపేదలు, నిరక్షరాస్యులే ఆయన సైనికులు. తుపాకులు లేని గెరిల్లా యోధులు. కానీ ధైర్యంతో నిండిన వీరులు. అలాంటి వారితో, పరిమిత వనరులతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఢీకొనడం అసాధారణమైన ఘనత. అల్లూరి గిరిజనుల జీవితాన్ని ఎంతో లోతుగా అధ్యయనం చేశారు. వారి సమస్యలు ఆయనకు అత్యంత స్పష్టంగా తెలియజేశాయి. పోడు వ్యవసాయంపై పన్నులు, అడవుల్లో ఆహారాల కోసం వెళ్లిన గిరిజనులపై పోలీసుల దుర్మార్గాలు, ధిక్కారంగా లెగింపు వ్యవస్థలు %–% ఇవన్నీ అతనిలో తిరుగుబాటు జ్వాలను రగిలించాయి. బ్రిటిష్ అధికారుల ఆదేశాలను అమలు చేస్తూ గిరిజనులను బానిసలుగా మార్చే ప్రయత్నాలు అల్లూరిని పోరాట మార్గంలోకి నడిపించాయి. ఆయన నమ్మిన సిద్ధాంతం ఒక్కటే %–% ఆయుధంతోనే స్వాతంత్ర్యం సాధ్యం. అంతే కాదు, అల్లూరి రాజకీయంగా ఎంతో దూరదృష్టి గలవాడు. ఆయనకు మతపరమైన విముక్తి కాక, భౌతిక విముక్తి అవసరం. స్వయం పాలన కోసం ఆయన తలపోయినదీ ప్రజల చేత ఉండే నియంత్రణ. అలాంటి ఆలోచనలు 20వ శతాబ్దం ప్రారంభంలో ఉండటం ఆయన లోతైన చింతనకు నిదర్శనం. ఆయన గిరిజనులకు సరైన జీవనోపాధిని కల్పించాలన్న లక్ష్యంతో కృషి చేశారు. వారి వన హక్కులు, జీవనాధికారం, సంస్కృతి పరిరక్షణపై ఆయనకు అసాధారణమైన నిబద్ధత. ఆయన పోరాట పద్ధతులు గెరిల్లా యుద్ధ శైలికి చెందినవి. పోలీసు స్టేషన్లపై అర్ధరాత్రి దాడులు, ఆయుధాల స్వాధీనం, అధికారులపై గుళికల వర్షం ఇవన్నీ అల్లూరి యుద్ధ సాంకేతికతలో భాగం. కొన్నేళ్ల పాటు ఆయన నేతృత్వంలో మన్యం తిరుగుబాటు అగ్ని నిలకడగా వెలిగింది. బ్రిటిష్ సైన్యం అతన్ని పట్టుకునేందుకు ఎంత ప్రయత్నించినా విఫలమయ్యేది. సీతారామరాజు తిరుగుబాటు క్రమంగా బ్రిటిష్ పాలకుల గుండెల్లో వణుకుపుట్టించింది. అయితే, ప్రతి పోరాటానికీ ఓ మలుపుంటుంది. 1922 డిసెంబరు 6న జరిగిన ఘర్షణలో 12 మంది అనుచరులను అల్లూరి కోల్పోయారు. ఇది ఆయన ఉద్యమానికి తొలితెగులు. ఈ దెబ్బ తర్వాత కొన్ని నెలలు ఆయన నుంచి ఎటువంటి కార్యాచరణ జరగలేదు. ప్రజల్లో ఆయన మరణించినట్టు ప్రచారం జరిగింది. కానీ 1923 ఏప్రిల్‌లో ఆయన మళ్లీ ప్రత్యక్షమై, మరింత బలంగా దాడులు కొనసాగించారు. ఇదే సమయంలో బ్రిటిష్ అధికారులు మన్యం ప్రజలపై మరింత కఠినంగా వ్యవహరించారు. గ్రామాలపై దాడులు, దళారుల ఆగడాలు, గిరిజనులపై ఉక్కుపాదం పెడుతుండగా, అల్లూరి తాను ఎంతకాలం ఈ జనం కోసం పూర్తిగా రక్షణ కల్పించలేనన్న ఆత్మగ్లానికి లోనయ్యారు. అప్పటికి అల్లూరికి ఆలోచన వచ్చింది తాను బ్రిటిష్ అధికారులకు లొంగిపోతే మన్యం ప్రజల బాధ తక్కువవుతుంది. అదే సమయంలో ఆయన విలక్షణంగా తన అరెస్ట్‌ను ప్రణాళికాబద్ధంగా అమలు చేశారు. చెరువులో స్నానానికి వస్తున్నట్టు అనుచరుల ద్వారా సమాచారాన్ని లీక్ చేసి, సూటిగా తనను పట్టుకునేలా చేసుకున్నారు. 1924 మే 7న అతన్ని పట్టుకున్న పోలీసులు, న్యాయ విచారణ లేకుండానే అదే రోజు కాల్చిచంపారు. ఇది చట్టాన్ని అవమానపరిచే క్రూరతగా చరిత్రలో మిగిలిపోయింది. అయితే, బ్రిటిష్ ప్రభుత్వం సీతారామరాజును చంపగలిగినా, ఆయన ప్రజల్లో నాటిన స్వతంత్ర భావనను మాత్రం చంపలేకపోయింది. అల్లూరి మరణించినప్పటికీ, ప్రజల్లో ఆయన శక్తిగా, స్ఫూర్తిగా మారిపోయారు. ఆయన బోధనలు, కార్యాచరణలు, ధైర్యం, త్యాగం ప్రజల్లో ఉద్యమశీలతను పెంచాయి. అప్పటి నుంచి తెలుగునాట సాయుధ పోరాటాలకు బలమైన మౌలికంగా అల్లూరి ఉద్యమం నిలిచింది. అల్లూరి అంటే వ్యక్తి కాదు, ఓ భావం. ఓ ప్రేరణ. ఆయన వ్యక్తిత్వం, యోధత్వం, నాయకత్వం %–% ఇవన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక దిక్సూచి. ఆయన పోరాట పటిమ, వ్యూహచతురత, ప్రజలపై ప్రేమ %–% ఇవన్నీ యోగ్యతా ప్రమాణాలే కాకుండా, దేశభక్తికి పరాకాష్ఠ. 27 ఏళ్ల జీవితాన్ని దేశానికి అంకితం చేయడం మామూలు విషయం కాదు. ఆ వయస్సులో ఉన్న యువకులు ప్రపంచాన్ని చూడాలని కలలు కంటారు. కానీ అల్లూరికి ఒకే కల స్వతంత్ర దేశం. అల్లూరి జీవితం మనకు గుర్తు చేస్తుంది పోరాటానికి ఆయుధం అవసరం కాదు, కానీ ధైర్యం తప్పనిసరి. నిస్వార్థతతో కూడిన ఆశయం ఉంటే ఎలాంటి శక్తినైనా ఢీకొనవచ్చు. ఆయన మన్యం ప్రాంతపు దుర్భర పరిస్థితులను మార్చే ప్రయత్నం చేశారు. స్వతంత్ర భారత నిర్మాణానికి తొలి అడుగులు వేయించారు. నేడు అల్లూరి జయంతి సందర్భంగా, ఆయన త్యాగాన్ని, స్ఫూర్తిని మనసారా స్మరించాలి. ఈ దేశంలో బలహీనుల కోసం నిలబడే ప్రతి వాక్యం, ప్రతి ఉద్యమం, ప్రతి పోరాటం అల్లూరికి నివాళి. ప్రజల హక్కులకు పునాదులు వేసిన అల్లూరి అద్భుత వ్యక్తిత్వం కాలంతో మారదు. అది చరిత్రను దాటి, కాలాన్ని దాటి, ప్రజల గుండెల్లో నిలిచిపోయే దీపశిఖ. తెలుగు ప్రజల గర్వకారణంగా, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహా నాయకుడైన అల్లూరికి మా నమస్సులు. అల్లూరి సీతారామరాజు పేరు చెప్పగానే మదిలో మేలు బలంతో కూడిన ఒక తేజస్సు వెల్లివిరుస్తుంది. అది ఆయన జీవితం గల మహోన్నతతకు ప్రతిరూపం.

# నవ చరిత్రను సృష్టించనున్న దళపతి విజయ్



తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ తమిళ నటుడు 'దళపతి' విజయ్ తమిళ నాడు విజయపక్షం' అనే అర్థంలో 'తమిళగ వెట్రి కళగం' ( టి.వి.కె ) పేరుతో నూతన రాజకీయ పార్టీని స్థాపించి సరికొత్తసంచలనాన్ని సృష్టించి ఇటీవల ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించబడడం శుభపరిణామం. 'అవినీతిని అంతంచేసి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా తాను పార్టీని స్థాపించానని, ప్రజల సంక్షేమం కోసమేతన సినీ జీవితాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానని అంతిమంగా ప్రజానీకం అభ్యున్నతి కోసమే తనపోరాటం ఉంటుందిఅని ఆయన స్పష్టం చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కాలగమనంలో ఎం.జి.రామచంద్రన్, జయలలిత, శివాజీ గణేశన్, విజయకాంత్ మరియు కమల్ హాసన్ మొదలైన నటులుతమిళనాడు రాజకీయాలలో ప్రముఖ పాత్రని పోషించారు. నేడు అదే సినిమా రంగంలో రజనీకాంత్ తర్వాత అత్యంత ప్రేక్షకారాధన ఉన్న దళపతి విజయ్ ప్రజా సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ రాజకీయాలే లక్ష్యంగా ఉద్యుక్తులు కావడం నిజంగా హర్షణీయం. దళపతి విజయ్ నేతృత్వంలో విజయ్ మక్కల్ ఇయక్కంఅనే సంస్థ అనేక సంవత్సరాలుగా అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్ననూ లాభాపేక్ష లేని ఆ సంస్థ ద్వారా సువిశాల రాజకీయ మార్పులుసాధ్యం



కాని తరుణంలో రాజకీయ అధికారం సాధనే లక్ష్యం తమిళగ వెట్రి కళగం పార్టీ ఆవిర్భవించడం శుభ పరిణామం. గతంలో కేవలం పార్టీ పేరుని ఆయన ప్రకటించగానే ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలుజరుపుకోవడం తద్వారా ప్రజలకు ఆయనపై ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. 2024ఫిబ్రవరిలో టి.వి.కె పార్టీ ఆవిర్భవించిననూ అప్పటి లోక్ సభ ఎన్నికల్లో పోటీకి ఆ పార్టీ దూరంగా ఉన్నవిషయం అందరికి విదితమే. 2026 లో జరగబోయే తమిళనాడు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో విజయమేలక్ష్యంగా ముందుకు పయనించే విధంగా నిర్దిష్ట విధివిధానాలను అనుసరించనుండడాన్ని విజయ్వ్యూహాత్మక దూరదృష్టికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. తమ పార్టీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని గతంలోనే స్పష్టం చేసిన విజయ్ దానికే కట్టుబడి ఆ దిశగానే ముందుకు సాగుతుండటం గమనార్హం. %ఉచ39బీ%బి.జె.పి పార్టీతో చేతులు కలపడానికి మా పార్టీ డి.ఎం.కెమరియు అన్నా డి.ఎం.కె పార్టీల మాదిరిగా ఎంతమాత్రం కానేకాదు. బి.జె.పి విభజన రాజకీయాలు చేస్తుంది. బి.జె.పి విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవు. కేంద్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాలమూలంగా తమిళనాడులో అధికారంలోకి రాలేదు. అలాగే తమిళనాడులో అరాచక పాలన సాగిస్తున్నడి.ఎం.కె కూటమితో ఎట్టి పరిస్థితులలోనూ చేతులు కలపబోము. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి మరియు డి.ఎం.కె పార్టీలతో మాకు ఎలాంటి పొత్తు ఉండబోదు. ఆ రెండు పార్టీలు మాకు ప్రధాన సైద్ధాంతికశత్రువులు అని విజయ్ వ్యాఖ్యానించడాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గమనించవచ్చు. రాజకీయం అనేది ఒక వృత్తి కాదు. ఒక 'పవిత్రమైన ప్రజా సేవ' అని స్పష్టంగా చెప్పవచ్చు. పరిపాలనయంత్రాంగం క్షీణించి అవినీతి, పాలనాపరమైన అవకతవకలతో కూడిన కలుషితమైన రాజకీయాలు ప్రజలనుకుల, మతాల ప్రాతిపదికన విభజించే విభజన సంస్కృతి పాదుకొని ఉన్న నేటి స్వార్థపర రాజకీయాలనుదళపతి విజయ్ తీవ్రంగా నిరసించడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. ఈ రకంగా సమైక్యతను విధ్వంసం చేస్తూవిభజన రాజకీయాలు ఆధిపత్యాన్ని చెలాయించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించడాన్ని బాహాటంగానేగమనించవచ్చు. 'నిస్వార్థ, పారదర్శక, దూరదృష్టి గల, అవినీతి రహిత, కుల, మత విభేదాలు లేని సమర్థ పాలనయంత్రాంగానికి మార్గం సుగమం చేసే రాజకీయ ఉద్యమం కోసం తమిళులు ఆకాంక్షిస్తున్నారు. తమిళనాడుప్రజలు మార్పును ప్రజలు ఆకాంక్షిస్తున్న రాజకీయ మార్పునకు మార్గాన్ని సుగమం చేయడం మా లక్షం'అని దళపతి విజయ్ పేర్కొనడం విశిష్ట ప్రాధాన్యాన్ని స్పష్టంగా వెల్లడిస్తుంది. ప్రజా ఉద్యమం మాత్రమేరాజకీయ మార్పు తేగలదని, అది తమిళ నాడు హక్కులను కాపాడగలదని ఆయన స్పష్టం చేయడంగమనార్హం. ాలా మంది రాజకీయ నేతలు ఆయా పదవులలో ఉండి సినిమాలలో మాదిరిగా నటించారుతప్ప ప్రజల సంక్షేమం కోసం పెద్దగా పని చేసినది ఏమి లేదు. రాజకీయాలు అంటే సినిమాలు కాదు. ప్రజలజీవితాలతో నడిచే బాధ్యతాయుతమైన ప్రయాణం. నాకు రాజకీయ అనుభవం లేకపోయిననూ భయపడివెనక్కి తగ్గే ప్రసక్తే లేదు అని ఆయన పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఏది ఏమైననూ దళపతివిజయ్ మిగతా సినీ నటులకు భిన్నంగా తాను నిర్దేశించుకున్న విధివిధానాలను ఆచరణ రూపంలోముందుకు తీసుకువెళ్లి తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో నవచరిత్రను సృష్టించనున్నాడుఅనిఘంటాపథంగా చెప్పవచ్చు.

– జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వం: జులై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె!



కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దాని సైద్ధాంతిక భూమిక అయిన ఆర్ఎస్ఎస్ ఆదేశాల ప్రకారం కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తుల అనుకూల పరిపాలన సాగిస్తున్నది. 2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయటమే కాకుండా, దానికనుగుణంగా చట్టాలను రూపొందిస్తూ వస్తున్నది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని హరించి వస్తువుల మరియు సర్వీసుల పన్ను (జిఎస్టి)చట్టాన్ని తీసుకొచ్చారు. జీఎస్టీ చట్టం మూలమున రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు మున్సిపాలిటీ స్థాయికి దిగజారిపోయాయి. భారత రాజ్యాంగంలో చెప్పిన ఫెడరల్ స్ఫూర్తి కి భిన్నంగా ఈ చట్టం ఉన్నది. ఆ తరువాత రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని( సి ఏ ఏ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ ఆర్ సి) బిల్లును, ఎన్ పిఆర్ చట్టాలనుతీసుకొచ్చింది. అదే విధంగా భారత రాజ్యాంగంలో కాశ్మీర్ కు ఇచ్చినటువంటి స్వయం ప్రతిపత్తి 370, 35 ఆర్టికల్స్ ను రద్దు చేసింది. భారతదేశంలో ఇస్లాం ఫోబియోని రెచ్చగొట్టి మైనార్టీ ముస్లింలపై దారుణ మారణకాండ జరపటం దాని ఉద్దేశం. 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినం ఆర్ఎస్ఎస్ అధినేతలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భారత రాజ్యాంగం గా మనస్మృతి ఉండాలని, అదే తమ అభిమతం అని వారు ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద , ప్రజాతంత్ర, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తాము ఒప్పుకోవటం లేదని వారు అనేక సందర్భాల్లో ఘంటాపదంగా చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజా, ఒకే చట్టం పేరుతో భారతదేశాన్ని హిందూ దేశంగా లేదా హిందూ రాజ్యంగా ఏర్పడాలని ఆర్ఎస్ఎస్ ఉద్దేశమని వారు పదే పదే చెప్పారు. పూర్వం "జనసంఘ్" రాజకీయ పార్టీయే నేటి "భారతీయ జనతా పార్టీ". భారతీయ జనతా పార్టీ ఏర్పడినప్పుడు గాంధీ సోషలిజం తమ లక్ష్యం అన్నారు. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం భారత పార్లమెంటుకు రాజ్యాంగానికి సవరణ చేసే అధికారం ఉన్నదనీ,అయితే పార్లమెంటు చేసే చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వభావానికి లోబడి ఉండాలని, భిన్నంగా ఉండరాదని తీర్పు చెప్పింది. ఇటీవల ఆ పార్టీ నాయకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రవేశికలో "సోషలిస్టు, సెక్యులర్" అనేటువంటి పదాలు లేవని పదే పదే చెబుతన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్





( ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే బహిరంగ ప్రకటన కూడా ఇచ్చారు. సుప్రీమ్ కోర్టును కూడా ప్రభావితం చేసి బాబ్రీ మసీదు కేసులో తీర్పు వచ్చిన తీరును మనం చూసాం. నాటి ప్రధాన న్యాయమూర్తి రంజని గోగోయ్ కి రాజ్యసభ సభ్యత్వం, మరో సుప్రీంకోర్టు న్యాయమూర్తి నజీర్ కి మన రాష్ట్ర గవర్నర్ పదవి పొందారు. భవిష్యత్తులో భారత రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని కూడా పార్లమెంటు మార్చవచ్చు అనే తీర్పు వచ్చినా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. భారతీయ జనతా పార్టీకి తన మాతృ సంస్థ అయినటువంటి రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి హిందూ రాష్ట్ర ఎజెండా ఉన్నది. హిందూ మతం వేరు. హిందూత్వం వేరు. హిందూ మతోన్మాదం వేరు. కమ్యూనిస్టులు ఏ మత విశ్వాసాలకు వ్యతిరేకం కాదు. మతం వ్యక్తిగతం. ఎవరికి ఇష్టమైన మతంలో వారు ఉండవచ్చు. మత స్వేచ్ఛను కమ్యూనిస్టు పార్టీ గౌరవిస్తుంది. 20 కోట్ల మందికి పై గా ఉన్నటువంటి ముస్లింమైనార్టీలపై హిందూ మతోన్మాదాన్ని మొట్టమొదటగా రెచ్చగొడుతుంది. ఆ తరువాత క్రైస్తవులు, కమ్యూనిస్టులు, గిరిజనులు వారి ఎజెండాలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ వస్తున్నది. 1991లో శ్రీ పీ.వీ నరసింహారావు నేతృత్వంలో తీసుకొచ్చిన లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్ పి జి) నయా ఉదారవాద విధానాలు భాజపా ప్రభుత్వం మరింతగా అమలు చేస్తున్నది. అంబానీ ,ఆదాని లాంటి ఆశ్రితపక్షపాతులకు, కార్పొరేట్ దిగ్గజాలకు దేశ సంపదను అప్పజెప్పటానికి మొత్తం ప్రభుత్వ రంగ పరిశ్రమల న్నిటిని ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందుకనుగుణంగా అనేక చట్టాలను మారుస్తూ వస్తున్నది. అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి మొత్తం వ్యవసాయ ఉత్పత్తులన్నిటిని అంబానీ ,ఆదానీలకు వ్యాపార సరుకుగా చేయటానికి పూనుకున్నది. ప్రధాన నరేంద్ర మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉంటూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా భారతదేశ చట్టాలను మారుస్తున్నారు అనే విషయాన్ని మనం ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి. దీనిని భారతదేశ రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ముందు భాగాన నిలబడి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తిష్ట వేసుకుని ఆ చట్టాలను వెనక్కి తీసుకునేంతవరకు సంవత్సర కాలము పైగా దీర్ఘకాలం పోరాటం చేశారు. ఈ సందర్భంలో రైతు సంఘాలతో చేసుకున్న ఒడంబడికను నేటి వరకు అమలు చేయలేదు. అదే సమయంలో 29 కార్మిక చట్టాలను రద్దు పరుస్తూ నాలుగు లేబర్ కోడులను 2020 సంవత్సరంలో తీసుకొచ్చారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నాటి నుండి నేటి వరకు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన, వామపక్ష పార్టీల నాయకత్వాన సుదీర్ఘమైన పోరాటం చేస్తూ ఉన్నారు. పీవీ నరసింహారావు తీసుకొచ్చిన నయా ఉదారవాద విధానాల నుండి నేటి వరకు 19 సార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడులు కు వ్యతిరేకంగా మూడు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. అయినా ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారులకు (క్రోనీ క్యాపిటల్ లిస్టులకు) ప్రభుత్వ రంగ పరిశ్రమలను జాతి సంపదను అప్పజెప్పటమే కాకుండా దానికనుగుణంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు పరచాలని దుష్టతలంపుతో 29 చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను తయారు చేసింది. మొదటిది ,2019 వేతనాల కోడ్ అమలులోకి వస్తే జాతీయ కనీస వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు (పేమెంట్ ఆఫ్ వేజెస్) వేతనాలు నిర్ణయించే అధికారాన్ని కోల్పోతాయి. కనీస వేతనాలు (మినిమం వేజెస్) రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలయ్యే అవకాశం ఉండదు. ఓవర్ టైం చేసినందుకు కానీ, సమాన పనికి సమాన వేతనం గాని కోరే హక్కును కార్మిక వర్గం కోల్పోతుంది. రెండవది,2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలులోకి వస్తే సమ్మె హక్కు కొరకు కార్మిక వర్గం చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ కోడ్ లో కార్మికులు సమ్మె చేయటానికి అనేక ఆటంకాలు కల్పించారు. 100 మంది కన్నా తక్కువ మంది కార్మిక సంస్థల్లో పని చేస్తుంటే వారిని పైనుండి తొలగించటం సులభతరం అవుతుంది. పరిశ్రమల్లో కార్మిక సంఘాల ఏర్పాటు కష్ట భూయిష్టమవుతుంది. మూడవది,2020 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల పది మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలలో కార్మికుల ప్రాణాలకు భద్రత ఉండదు. కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ కోల్పోతారు. గిగ్ ,ఫ్లాట్, ఫారం, కార్మికుల రక్షణపై సరైన నిబంధనలు రూపొందించ లేనందున వారికి రక్షణ కరువవుతుంది. నాల్గవది,2020 సామాజిక భద్రత కోడ్ అమలులోకి వస్తే ఎవరికైనా ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చే అవకాశం వస్తుంది. అందువల్ల యాజమాన్యం ఈఎస్ఐ, పీఎఫ్ లు, గ్రాడ్యుటి కవరేజ్ లేకుండా ఉంటుంది. కార్మికులకు ఏ అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే కోటి మంది పైబడిన స్కీము వర్కర్లకి ఈ కోడ్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల సవరణ చట్టం బిల్లు 2025 ని ప్రవేశపెట్టి క్యాబినెట్ ఆమోదం పొందింది. ఈ బిల్లు ప్రకారం కనీస పని దినం, 9 నుండి 10 గంటలు గా నిర్ణయించారు. అదేవిధంగా మహిళలు రాత్రిపూట పని చేయటానికి అనుమతిస్తున్నది . మహిళలకు సమానత్వం సాధికారత పేరుతో రాత్రిపూట కూడా మహిళలు పరిశ్రమల్లో, ఫ్యాక్టరీల్లో పని చేయడానికి ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే అనుమతిలభిస్తుంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరిపాలిస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే ఓవర్ టైం కూడా 75 గంటల నుండి 144 గంటల వరకు అనుమతిస్తుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం మార్కెటింగ్ యాక్ట్ చట్ట రూపం తీసుకురాబోతున్నది. పొట్టి శ్రీరాములు జిల్లా, ఉలవపాడు మండలం, కర్రేడు పరిసర గ్రామ ప్రాంతాల మూడు పంటలు పండే భూములను "ఇండో సోలార్ ప్రాజెక్టు కంపెనీ"కి సుమారు 8500 ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవటానికి నోటీస్ ఇవ్వగా , భూములు ఇవ్వటానికి రైతుల నిరాకరించి పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమయ్యారు. స్థలాభావం వల్ల అన్ని విషయాలను ఇక్కడ చెప్పటం సాధ్యపడటం లేదు. కావున కార్మికులు ఈ క్రింది ప్రధాన డిమాండ్ల అమల కొరకు పోరాడవలసిందిగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) యావత్ కార్మిక లోకానికి ,ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది.

1. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయడానికి పోరాడండి!
2. కనీస రోజు వారి వేతనాలు ?1000 రూపాయలు మరియు నెలవారీ వేతనాలు ?31,000 రూపాయలు కోసం పోరాడండి!
3. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేయడానికి పోరాడండి!
4. 8 గంటల ప్రామాణిక పని గంటల కోసం పోరాడండి!
5. సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి!
6. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టుల హిందూ రాజ్యాన్ని ఓడించండి!
7. మతం, కులం, ప్రాంతీయత, పేరుతో కార్మికుల విభజనను వ్యతిరేకించండి!
8. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఫ్యాక్టరీలో బిల్లును 2025 ను వ్యతిరేకించండి!

–మన్నవ హరిప్రసాద్, కన్వీనర్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ), ఆంధ్ర ప్రదేశ్ కమిటీ.,
82477 28296



## మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ



మత సామరస్యానికి ప్రతీక సింహపురి (నెల్లూరు) గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గా మతసామరస్యానికి ప్రతీక. దాన్ని కుల, మత, వర్గాలకు అతీతంగా ఎవరైనా దర్శించుకోవచ్చు. అక్కడ జరిగే రొట్టెల పండుగ ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏటా అయిదు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్త జనం తరలివస్తారు. నేడు ప్రారంభమవుతున్న ఈ వేడుకలకు ఘనమైన చరిత్రే ఉంది. ఆర్కాడు నవాబు కాలం నుంచి. సుమారు 400 సంవత్సరాల క్రితం సౌదీ, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కర్ణాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేవి. ఆ ప్రచారకుల్లో 12 మంది నెల్లూరు జిల్లాలో పర్యటిస్తూ... కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడు వారికి, బ్రిటిష్ సైనికులకు మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆ ప్రచారకులు ప్రాణత్యాగం చేశారు. వారి తలలు గండవరం వద్ద పడిపోగా... వారి మొండేలతో గుర్రాలు నెల్లూరు చేరాయి. ఆ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమా?ధి చేశారు. కొన్నేళ్ళ తరువాత... ఆ చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికి, అక్కడ ఉన్న చెట్టు కింద విశ్రమించారు. ఆ రజకుడి భార్యకు ఒక దైవ స్వరూపుడు కలలోకి వచ్చి.. బారా షహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకున్నవారు అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెప్పాడు. ఆమె తన కల గురించి భర్తకు చెప్పింది. ఈ విషయాన్ని దగ్గరలో ఉన్న రాజభటులకు ఆ దంపతులు నివేదించారు. వారిని ఆర్కాటు నవాబు దగ్గరకు భటులు తీసుకువెళ్ళారు. అప్పట్లో నవాబు కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె స్వస్థత కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో... ఆ దంపతులు చెప్పిన మాటలను నవాబు విశ్వసించాడు. వాటిని పాటించాడు. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబుకు ఆశ్చర్యం కలిగింది. అతను బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకొని పూజలు చేశాడు. సమాధుల దగ్గర ఉన్న మట్టితో లేపనం చేసుకోవడం వల్ల నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ ఆ దర్గాలో పూజలు ఆరంభించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో ఆ సమాధులకు పూజలు జరుగుతున్నాయి.

హిందువులు పెట్టిన పేరే..ఆర్కాట్ నవాబు 1757లో ఆ ప్రదేశంలో పండుగను ప్రారంభించినట్టు చరిత్ర చెబుతోంది. పూజలు చేసేందుకు వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలి వాటిని అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం, పక్కవారికి ఇవ్వడం రొట్టెల పండుగలో ఆనవాయితీ అయింది.. నవాబు పాలనలో... ఆయన ప్రతినిధిగా ... పండుగ జరిగేది. ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. అయితే, చెరువు వద్ద రొట్టెలు మార్చుకొనే ఆనవాయితీ కారణంగా దీన్ని 'రొట్టెల పండుగ' అనే పేరు స్థిరపడిపోయింది. ఈ పేరు హిందువులు పెట్టిన పేరేననీ, అది తమకు గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ ఖ్యాతి నెల్లూరు జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకు పాకింది. రొట్టెల పండుగలో... కొత్త కోరికలు కోరుకొనేవారు, కోరికలు తీరినవారు... ఇలా ఎందరో 'వరాల రొట్టెల'ను అందుకుంటారు. ప్రసాదాలుగా భావించే ఈ రొట్టెల్లో... కాలక్రమేణా రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు... ఇలా వివిధ కోరికలు తీరాలనుకొనే వారి కోసం ఎన్నెన్నో రొట్టెలు అందుబాటులో ఉంటున్నాయి.

# రైల్వే ప్లాట్‌ఫామ్‌పై హెయిర్ క్లిప్, పాకెట్ నైఫ్‌తో డెలివరీ.. ఆర్మీ డాక్టర్‌పై ప్రశంసలు



**న్యూఢిల్లీ- నవభూమి:** పురిటి నొప్పులు భరించలేక రైల్వే స్టేషన్ లో అల్లాడుతున్న ఓ గర్భిణికి అక్కడే ఉన్న ఓ ఆర్మీ డాక్టర్ డెలివరీ చేసి ప్రాణాలు నిలబెట్టాడు. ఎలాంటి పరికరాలు లేకపోయినా కేవలం హెయిర్ క్లిప్ పాకెట్ నైఫ్ తో డెలివరీ చేసి తల్లీబిడ్డలను బతికించాడు. దాంతో డాక్టర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. నార్త్ సెంట్రల్ రైల్వేస్ లోని ఝాన్సీ డివిజన్ లో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉత్తరమధ్య రైల్వేలోని ఝాన్సీ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి మనోజ్ కుమార్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ గర్భిణి పాన్వెల్-గోరఖ్‌పూర్ రైలులో ప్రయాణిస్తుండగా ఆమె తీవ్రమైన పురిటి నొప్పులు వచ్చాయి. దాంతో ఆస్పత్రికి తరలించడం కోసం ఝాన్సీ రైల్వేస్టేషన్‌లో ఆమెను కిందకు దించారు. రైలు దిగగానే వీల్‌ఛైర్‌లో లిఫ్ట్ దగ్గరకు తీసుకెళ్తుండగా నొప్పి తీవ్రమై విలవిల్లాడుతూ ఆమె కింద పడిపోయింది. అది చూసి అక్కడే హైదరాబాద్ వెళ్లే రైలు కోసం వేచిచూస్తున్న ఆర్మీ వైద్యుడు మేజర్ డాక్టర్ రోహిత్ బచ్వాలా (31) స్పందించాడు. రైల్వే సిబ్బంది సాయంతో ఆమెకు ప్లాట్‌ఫామ్‌పైనే అత్యవసరంగా డెలివరీ చేసేందుకు సిద్ధమయ్యాడు. రైల్వే సిబ్బంది తమ దగ్గరున్న సామాగ్రితో చాటు ఏర్పాటు చేయగా.. వైద్యుడు కేవలం హెయిర్ క్లిప్, పాకెట్ నైఫ్ తో డెలివరీ చేశాడు. డెలివరీ అనంతరం తల్లీబిడ్డ క్షేమం అని నిర్ధారించుకున్న తర్వాత హెయిర్ క్లిప్‌తో బొడ్డుతాడును లాక్ చేసి, పాకెట్ నైఫ్‌తో దాన్ని కత్తిరించాడు. సదరు గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత తన రైలు రావడంతో హైదరాబాద్‌కు వచ్చాడు. కాగా సమయానికి స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలు నిలబెట్టిన ఆర్మీ డాక్టర్‌పై రైల్వే సిబ్బంది, ప్రయాణికులు ప్రశంసలు కురిపించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | సోమవారం | 07 | జూలై | 2025

## ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం.. కూల్ డ్రింక్‌లో విషం కలిపి మైనర్ హత్య



**ముంబై- నవభూమి:** ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఉన్నది. ఆ యువకుడికి దూరంగా ఉంచేందుకు మైనర్ బాలుడి కుటుంబం ప్రయత్నించింది. కలత చెందిన యువకుడు కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఆ బాలుడ్ని హత్య చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. 19 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలుడి మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఏర్పడింది. నాలుగు నెలల కిందట వారిద్దరూ నాగ్‌పూర్ వెళ్లి గడిపారు. ఈ విషయం తెలిసిన మైనర్ బాలుడి కుటుంబం అతడ్ని కట్టడి చేశారు. సంబంధం ఉన్న యువకుడిని కలవవద్దని, మాట్లాడవద్దని చెప్పారు.

కాగా, తనకు దూరంగా ఉండటంపై కలత చెందిన యువకుడు ఆ బాలుడ్ని హత్య చేయాలని ప్లాన్ చేశాడు. జూన్ 29న తన వద్దకు రప్పించాడు. కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చాడు. అది తాగిన బాలుడు వాంతి చేసుకున్నాడు. ఆ తర్వాత అక్కడి బెడ్‌పై మరణించాడు. మరోవైపు కుమారుడు కనిపించకపోవడంతో బాలుడి కోసం తండ్రి వెతికాడు. ఆ యువకుడి వద్దకు వెళ్లినట్లు బాలుడి ఫ్రెండ్ చెప్పాడు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి చేరుకున్నారు. బెడ్‌పై అచేతనంగా పడి ఉన్న కుమారుడ్ని చూశారు. ఆ పక్కనే ఆ యువకుడు కూడా కూర్చొని ఉన్నాడు. కాగా, డాక్టర్‌ను పిలిపించగా ఆ బాలుడు మరణించినట్లు నిర్ధారించారు. దీంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వలింగ సంపర్క సంబంధానికి దూరంగా ఉన్నందుకు బాలుడ్ని ఆ యువకుడు హత్య చేశాడన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హత్యాయత్నం ఆరోపణలపై.. ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్



**అహ్మదాబాద్-నవభూమి:** గుజరాత్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యాయ త్నంతోపాటు పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్ నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నర్మదా జిల్లాలోని దేడియాపడా నియోజకవర్గం పరిధిలో శనివారం ఒక సమావేశం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే చైతర్ వాసవ ఇందులో పాల్గొన్నారు. సమన్వయ కమిటీలో సభ్యుడిగా తనను నియమించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సగ్బారా తాలూకా పంచాయతీ మహిళా అధ్యక్షురాలిని దుర్భాషలాడారు. కాగా, దేడియాపడ తాలూకా పంచాయతీ అధ్యక్షుడు సంజయ్ వాసవ జోక్యం చేసుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే చైతర్ మొబైల్ ఫోన్ విసిరడంతో అతడి తలకు గాయమైంది. ఆ తర్వాత గ్లాస్‌తో దాడి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే పగిలిన గాజు గ్లాస్ పెంకుతో తనను చంపుతానని ఎమ్మెల్యే చైతర్ వాసవ బెదరించినట్లు పంచాయతీ అధ్యక్షుడు సంజయ్ వాసవ ఆరోపించాడు. అక్కడి నుంచి తప్పించుకుని వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్యాలయంలోని కుర్చీని కూడా ఆ ఎమ్మెల్యే ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరోవైపు హత్యాయత్నంతోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి వేళ ఎమ్మెల్యే చైతర్ వాసవను అరెస్ట్ చేశారు. దీంతో దేడియాపడాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో జనం గుమిగూడటంపై ఆంక్షలు విధించారు.

## రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం..!

### ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ నివేదిక..!

**న్యూఢిల్లీ-నవభూమి:** ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా రాయబార కార్యాలయాల ద్వారా ప్రచారం చేస్తోందని.. ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోందని ఫ్రెంచ్ సైనిక, నిఘా సంస్థలు ఓ నివేదికలో వెల్లడించాయి. ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ ప్రచారం భారీగా పెరిగింది. చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం చేసుకుంటున్నది. నివేదికల ప్రకారం.. చైనా రాయబార కార్యాలయాల్లో పోస్ట్ అయిన రక్షణశాఖ అధికారులు వివిధ దేశాలను రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయొద్దని పట్టుబడుతున్నట్లుగా పేర్కొన్నాయి. రఫేల్ జెట్‌లను కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్న ఇండోనేషియాను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అయితే, చైనా తన యుద్ధ విమానాలను ప్రమోట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. వాటిని కొనుగోలు చేయాలని ఆయా దేశాలపై ఒత్తిడి తీసుకువస్తున్నది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మే నెలలో భారత్-పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. భారత్ మిస్సైల్స్, యుద్ధ విమానాలను ఉపయోగించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. అయితే, పాక్ వాడిన చైనా తయారు చేసిన ఆయుధాలు, ముఖ్యంగా యుద్ధ విమానాలతో పాటు భారతదేశం వాడిన ఫ్రెంచ్‌లో తయారైన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా ఎలా పని చేశాయో తెలుసుకునేందుకు సైనిక నిపుణులు ప్రయత్నిస్తున్నారు. మూడు రఫేల్ జెట్లతో సహా ఐదు భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లుగా పాకిస్తాన్ చెప్పుకుంటున్నది. అయితే, అయితే, ఫ్రెంచ్ వైమానిక దళ చీఫ్ జనరల్ జెరోమ్ బెల్లాంజర్ మాట్లాడుతూ.. ఉద్రిక్తతల సమయంలో భారత్ ఒక రఫేల్ యుద్ధ విమానం.. ఒక సుఖోయ్, మిరాజ్2000 సహా మూడు యుద్ధ విమానాలను మాత్రమే కోల్పోయి ఉండవచ్చన్నారు. ఫ్రాన్స్ రఫేల్ యుద్ధ విమానాలను విక్రయించిన అన్ని దేశాల్లో రఫేల్ లక్ష్యంగా చేసుకోవడం ఇదే తొలిసారి. యుద్ధ విమానం కూల్చివేసినట్లయితే ఆ దేశాన్ని దాని గురించి ప్రశ్నించాలని జెల్లాంజర్ పేర్కొన్నారు. రఫేల్, సంబంధిత పరికరాలు ఫ్రాన్స్ ఆయుధ ఎగుమతుల్లో కీలకం. వివిధ దేశాలతో ఫ్రాన్స్ సంబంధాలను మెరుగుపరచడానికి ఇది ప్రధాన మార్గం. ముఖ్యంగా ఆసియాలో చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకుంటున్నది.

# వెండితెర రారాజులు రాజకీయాల్లో హిట్టా ఫట్టా?



**చెన్నై- నవభూమి:** తమిళనాడు రాజకీయాలు మొదటి నుంచి సినిమా గ్లామర్‌తో ముడిపడి ఉంటాయి. సిల్వర్ స్క్రీన్‌పై మెప్పించినవారే.. పాలనలోనూ ప్రజల మన్ననలు పొందినవారు ఉన్నారు. అప్పుడెప్పుడో వచ్చిన ఎంజీఆర్ నుంచి మొదలుపెడితే జయలలిత వరకు.. కరుణానిధి నుంచి కమల్ హాసన్, రజినీకాంత్ వరకు అంతా వెండితెరపై మెప్పించి.. రాజకీయాల్లోకి అడుగుపెట్టినవారే. అయితే వీరిలో అందరూ సక్సెస్ కాకపోయినా కొందరు సీఎం కుర్చీపై కూర్చొని చక్రం తిప్పినవారే. ఇప్పుడు తమిళ రాజకీయాల్లో అడుగుపెట్టిన దళపతి విజయ్ .. పార్టీని పెట్టి వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించుకున్నాడు. తెలుగులో కూడా అప్పట్లో ఎన్టీఆర్ దగ్గరి నుంచి ఇప్పటి పవన్ కళ్యాణ్ వరకు.. పార్టీలను స్థాపించినవాళ్లే. మధ్యలో మెగాస్టార్ చిరంజీవి పార్టీని పెట్టినా.. సీఎం కుర్చీపై కూర్చోకుండానే పార్టీని విలీనం చేశారు. సూపర్ హిట్ అనుకున్న సినిమా బాక్సాఫీస్ వద్ద బద్ధలైనట్లు.. ఎన్నో ఆశయాలు, ఆకాంక్షలతో పార్టీలు పెట్టినా.. అవి ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఒంటరిగా ఎన్నికలకు వెళ్తానంటున్న దళపతి విజయ్.. ప్లాన్ ఏ మేరకు సక్సెస్ అవుతుంది.సీఎం అభ్యర్థిగా విజయ్

గతేడాది తమిళగ వెట్రి కళగం-టీవీకే పార్టీని స్థాపించిన స్టార్ హీరో, దళపతి విజయ్.. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తమ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్ అని ఇప్పటికే టీవీకే ప్రకటించింది. ఇక తమిళనాడు రాజకీయాల్లో సినిమా హీరోలు పార్టీలు పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. మరోవైపు.. ప్రస్తుత పరిస్థితుల్లో తమిళనాడులో ఉన్న పార్టీలన్నీ ఏదో ఒక పార్టీతో కలిసి పొత్తు పెట్టుకుని పోటీ చేస్తుండగా.. దళపతి విజయ్ మాత్రం.. టీవీకే ఒంటరిగానే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగుతుందని సంచలన ప్రకటన చేయడంతో తమిళ రాజకీయాలు హీటెక్కాయి. రాజకీయాల్లోకి వస్తా అని జాప్యం చేయకుండా.. ప్రకటించిన తర్వాత వేగంగా అందుకు ప్లాన్లు సిద్ధం చేసుకున్నారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికలకు ముందే పార్టీని పెట్టిన విజయ్.. తమ టార్గెట్ 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే అనే పక్కా క్లారిటీతో ముందుకెళు తున్నారు. ఇక ముఖ్యమంత్రి అభ్యర్థిగా తానే ఉంటానని స్పష్టం చేయడంతో ఫ్యాన్స్‌లో మరింత జోష్ నెలకొంది. ఇక విజయ్‌కి మరీ ముఖ్యంగా యూత్ ఫాలోయింగ్ ఎక్కువ. విజయ్‌కి యువతలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బలమైన ఫ్యాన్ బేస్ ఉంది. ఇదే దళపతికి అతి పెద్ద దళం. మరోవైపు.. తన సినిమాల్లో తరచుగా అవినీతి, సామాజిక అసమానతలు వంటి అంశాలపై విజయ్ దృష్టి సారించాడు. దీంతో సాధారణ ప్రజలకు చేరువయ్యే అవకాశం లభించింది. పార్టీ స్థాపించిన తర్వాత.. విజయ్ తన అభిమాన సంఘాలను రాజకీయ పార్టీ యూనిట్లుగా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని బలహీనమైన సంస్థాగత నిర్మాణంతో కాకుండా.. ముందుగానే బలంగా పార్టీని నిర్మించుకునే ప్రయత్నంలో మునిగిపోయారు.

**విజయ్ దళపతికి సవాళ్లు**

తమిళ రాజకీయాల్లో ఒంటరిగా పోరాటం చేస్తానని ప్రకటించిన విజయ్ దళపతికి అన్ని వైపుల నుంచి గట్టిపోటీ నెలకొననుంది. అటు అధికార డీఎంకేతోపాటు.. అన్నాడీఎంకేతో కూడా టీవీకేకు ప్రత్యర్థిగా ఉంది. సుదీర్ఘ కాలంగా తమిళనాడు రాజకీయాల్లో కేవలం డీఎంకే, అన్నాడీఎంకేల మధ్యే ద్విముఖ పోరు ఉంది. ఈ రెండు పార్టీలకు మాత్రమే క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాలు.. దీర్ఘకాలిక రాజకీయ చరిత్ర, నిధులు ఉన్నాయి. వీటిని ఎదుర్కోవడం దళపతి విజయ్‌కి అతి పెద్ద సవాల్. ఇక తమిళనాడు రాజకీయాలు కేవలం సినీ గ్లామర్‌తోనే గట్టెక్కలేవు అనే విషయాన్ని ఇప్పటికే రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి వారి అనుభవాలు చెబుతున్నాయి. ప్రజల సమస్యలను ఎంతవరకు విజయ్ అర్థం చేసుకుంటాడు.. వాటికి ఎంత సమర్థవంతమైన పరిష్కారాలు చూపుతాడు అనేది తమిళులను నమ్మించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్యక్ష రాజకీయ అనుభవం లేకపోవడం విజయ్‌కు ఒక పెద్ద ఎదురుదెబ్బ. పార్టీ సైద్ధాంతిక వైఖరి, విధానాలపై విజయ్ ఎంత స్పష్టత ఇస్తాడు అనేది కూడా కీలకం కానుంది.

**తమిళ రాజకీయాల్లో సినీ ప్రభావం**

తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని దశాబ్దాలుగా సినీ ప్రముఖుల ఆధిపత్యంలోనే ఉన్నాయి. కేవలం నటులు మాత్రమే కాకుండా.. రచయితలు, దర్శకులు కూడా తమిళ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.

**ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్)**

సినీ నటుడిగా తిరుగులేని స్టార్‌డమ్ సొంతం చేసుకున్న ఎంజీఆర్.. డీఎంకే పార్టీ నుంచి బయటకొచ్చి అన్నాడీఎంకే పార్టీని స్థాపించారు. పేద ప్రజల హృదయాలను గెలుచుకుని.. మూడుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన తుదిశ్వాస వరకు అసెంబ్లీలో మెజారిటీని నిలబెట్టుకున్నారు. ఎంజీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు తోడు.. ఆయనకు ఉన్న సినిమా ఇమేజ్ ఆయనను సీఎం కుర్చీలో కూర్చోబెట్టింది. ఎంజీఆర్‌ను ఒక దేవుడిలా ఆరాధించిన తమిళ తంబీలు.. ఆయన చనిపోయిన తర్వాత కూడా అన్నాడీఎంకే వెంటనే ఉన్నారు.

**జే జయలలిత**

ఎంజీఆర్ శిష్యురాలిగా, సినీ హీరోయిన్‌గా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన జయలలిత.. పురట్చి తలైవిగా ప్రజల మన్ననలు పొందారు. ఎంజీఆర్ మరణం తర్వాత అన్నాడీఎంకేను సమర్థవంతంగా నడిపి.. ఆరుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన జయలలిత.. తమిళ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఎన్నో ఆటంకాలు, అవరోధాలు, కేసులు, అవమానాలు ఎదురైనా.. ధైర్యంగా నిలిచిన పురట్చి తలైవి.. తాను మరణించే వరకు కూడా తిరుగులేని నాయకురాలిగా కొనసాగారు. ఎం. కరుణానిధి

డీఎంకే అధినేతగా, రచయితగా, సినీ రంగంతో బలమైన సంబంధాలు కలిగి ఉన్న కరుణానిధి.. ఐదుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన వాక్చాతుర్యం, రచనా నైపుణ్యంతో కరుణానిధి తమిళ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. తాను మరణించేవరకు కూడా తమిళ రాజకీయాల్లో చక్రం తిప్పారు. కరుణానిధి తర్వాత ఆయన కుమారుడు ఎంకే స్టాలిన్ ప్రస్తుతం సీఎంగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే ఎంకే స్టాలిన్ కుమారుడు, సినీ హీరో ఉదయనిధి స్టాలిన్ కూడా రాజకీయాల్లోకి అరంగేట్రం చేసి.. ప్రస్తుతం తమిళనాడు డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. అదే సమయంలో తమిళ రాజకీయాల్లోకి వచ్చి కొత్తగా పార్టీని పెట్టి.. అంతగా సక్సెస్ కాని హీరోలు కూడా ఉన్నారు. రజినీకాంత్, కమల్ హాసన్, కెప్టెన్ విజయ్‌కాంత్ లాంటి వాళ్లు సినీ గ్లామర్ నుంచి రాజకీయాల్లోకి వచ్చినా.. దాన్ని అందిపుచ్చుకోలేకపోయారు. రజినీకాంత్, కమల్ హాసన్‌లకు తమిళ ప్రజల్లో అపారమైన ఫ్యాన్ బేస్ ఉన్నప్పటికీ.. రాజకీయాల్లో వారు ఆశించిన విజయం సాధించలేకపోయారు. దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే) అనే పార్టీని స్థాపించిన కెప్టెన్ విజయ్‌కాంత్.. రాజకీయాల్లో కెప్టెన్‌గా నిలవలేకపోయారు. అనారోగ్య కారణాలతో 2023లో కెప్టెన్ మరణంతో ఆ పార్టీకి పెద్ద దిక్కులేకుండా పోయింది.

**రజినీకాంత్**

గత కొన్ని దశాబ్దాలుగా రాజకీయాల్లోకి వస్తారని అభిమానులను ఉత్సాహంలో ఉంచిన రజినీకాంత్.. 2020 డిసెంబర్‌లో తాను పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. అయితే అనారోగ్య కారణాలు, ఆధ్యాత్మికత పేరుతో కేవలం నెల రోజుల్లోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని రాజకీయాల్లోకి రావడం లేదని చెప్పడం.. తలైవా అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. రాజకీయాలకు సంబంధించి రజినీకాంత్ క్లారిటీగా లేకపోవడం, ఆయన ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడం, పార్టీ విధివిధానాలపై స్పష్టత లేకపోవడం, చివరి నిమిషంలో వెనకడుగు వేయడం వంటివి రజినీకాంత్‌కు ప్రతికూలంగా మారాయి.

**కమల్ హాసన్**

రజినీకాంత్ కంటే ముందుగానే తమిళ రాజకీయాల్లోకి కమల్ హాసన్ అడుగుపెట్టారు. 2018లో మక్కల్ నీది మయ్యం పేరుతో ఒక పార్టీని స్థాపించారు. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కమల్ హాసన్ పార్టీ పోటీ చేసి.. ఎక్కడా కనీసం ప్రభావం చూపలేకపోయింది. చివరికి కమల్ హాసన్ కూడా ఓటమి పాలు కావడం ఎంఎన్ఎమ్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. విశ్వనటుడుగా కమల్ హాసన్‌కు వ్యక్తిగతంగా మంచి ఇమేజ్ ఉన్నప్పటికీ.. పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం, స్పష్టమైన రాజకీయ సిద్ధాంతం ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం, సినీ గ్లామర్‌ను ఓట్లుగా మలుచుకోవడంలో విఫలం కావడం వంటివి కమల్ హాసన్‌కు అడ్డంకులుగా నిలిచాయి. ఈ క్రమంలోనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకుంటున్నట్లు ప్రకటించిన మక్కల్ నీది మయ్యం.. డీఎంకే పార్టీకి మద్దతు తెలిపింది. దీనికి ప్రతిఫలంగా ఇటీవల డీఎంకే పార్టీ.. కమల్ హాసన్‌ను రాజ్యసభకు నామినేట్ చేసింది. తెలుగులోనూ మెగాస్టార్ అలా.. **పవర్‌స్టార్ ఇలా..**

తమిళ రాజకీయాలను స్ఫూర్తిగా తీసుకుని తెలుగులో కూడా సినిమా హీరోలు పార్టీలు పెట్టిన చరిత్ర కనిపిస్తోంది. అప్పట్లో ఎన్టీఆర్.. తెలుగుదేశం పార్టీని స్థాపించి అఖండ విజయంతో సీఎం కుర్చీని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇదే స్ఫూర్తితో మెగాస్టార్ చిరంజీవి 2008 అసెంబ్లీ ఎన్నికల ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించినా.. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హవాలో కొట్టుకుపోయారు. ఆ తర్వాత పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్రమంత్రి కుర్చీతో సరిపెట్టుకున్నారు. ఆ తర్వాత 2014 ఎన్నికలకు ముందు జనసేన పార్టీని స్థాపించిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ఆ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కూటమికి మద్దతు తెలిపారు. ఆ తర్వాత ఈ 3 పార్టీలు విడిపోయినా.. మళ్లీ 2024 ఎన్నికలకు కలిసి పోటీ చేసి.. ఘన విజయాన్ని సాధించాయి. దీంతో పవన్ కళ్యాణ్‌కు.. డిప్యూటీ సీఎం కుర్చీ దక్కింది.

ఇక తమిళనాడు, తెలుగు రాజకీయాల్లో హీరోల సక్సెస్, ఫెయిల్యూర్ చూసిన తర్వాత 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు విజయ్ దళపతి.. ఏ స్థాయిలో ప్రభావం చూపుతాడు అనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠను రేపుతున్నాయి. ఈ ఎన్నికలే దళపతి విజయ్‌కి.. రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి లాగా రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని విజయ్ లిఖిస్తారా.. లేక రజినీకాంత్, కమల్ హాసన్ మాదిరిగా వెనకబడతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

# యువకుడి కోసం 40 మంది గ్యాంగ్‌స్టర్లు వేట!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఓ మాఫియా ముఠాలోని సభ్యుడైన యువకుడు.. తమ నాయకుడు భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆమెను బైక్‌పై బయటకు తీసుకెళు తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ మహిళ చనిపోయింది. అయితే, అతడే ఆమెను హత్య చేశాడని ఆరోపిస్తూ ముఠాలోని 40 మంది గ్యాంగ్‌స్టర్లు ఆ యువకుడ్ని చంపేందుకు రంగంలోకి దిగారు. అచ్చం సినిమాను తలపించే ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కరుడగట్టిన ఇప్పా ముఠా నాయకుడి భార్యతో.. ముఠాలో ఒకరైన అర్షద్ తోపీ అనే యువకుడు రహస్య సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇద్దరూ కలిసి బైక్‌పై నగరంలోని కాంప్టీ ప్రాంతానికి వెళ్లారు. ఇదే సమయంలో వారి బైక్‌ను ఓ జేసీబీ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ప్రమాదంలో టోపీ స్వల్ప గాయాలతో తప్పించుకోగా, మహిళకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స కోసం వెంటనే పెట్రోలింగ్ వాహనంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కానీ అక్కడ వైద్యం నిరాకరించడంతో కాంప్టీలోని మరొక ఆసుపత్రికి తరలించగా.. అక్కడ కూడా వైద్యులు ఆమెను చేర్చుకోలేదు. చివరికి అర్షద్ తోపీ ఒక అంబులెన్స్ డ్రైవర్‌కు డబ్బు చెల్లించి, ఆమెను నాగ్‌పూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. అయితే, ఇది ప్రమాదం కాదని, హత్యగా భావిస్తున్న ఇప్పా గ్యాంగ్ సభ్యులు టోపీపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయారు. 'విశ్వాస ఘాతుకుడిని మట్టుబెడతాం' అంటూ మొత్తం 40 మంది సభ్యులు నగరమంతా తోపీ కోసం గాలింపు చేపట్టారు. తన ప్రాణాలకు ప్రమాదం ఉందని గ్రహించిన అర్షద్.. డిప్యూటీ కమిషనర్ ఆఫీస్‌కు వెళ్లి రక్షణ కోరాడు' అని ఒక పోలీసు అధికారి తెలిపారు. వెంటనే అతడిని కొరాడీ పోలీస్ స్టేషన్‌కు తరలించి, పూర్తి వివరాలను రికార్డు చేశారు. కానీ, పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఇది నిజంగా రోడ్డు ప్రమాదమే అని తేలిందని తెలుస్తోంది. కానీ గ్యాంగ్ మాత్రం టోపీనే ఆమెను చంపేశాడనే అనుమానంతో దాడులకు దిగనుంది. టోపీ ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు

## గడువు తీరినా బంగ్లా ఖాళీ చేయని మాజీ సీజే జస్టిస్ చంద్రచూడ్..

### కేంద్రానికి సుప్రీంకోర్టు లేఖ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ అత్యున్నత న్యాయస్థానానికి నేతృత్వం వహించిన మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ తన పదవీ విరమణ అనంతరం కూడా అధికారిక నివాసం ఖాళీ చేయకపోవడం వివాదాస్పదంగా మారింది. దీనిపై కేంద్రానికి లేఖ రాసిన సుప్రీంకోర్టు .. జస్టిస్ చంద్రచూడ్ తో తక్షణమే కృష్ణ మీనన్ మార్గ్ 5లోని బంగళాను ఖాళీ చేయించాలని విజ్ఞప్తి చేసింది. జస్టిస్ చంద్రచూడ్ 2024 నవంబర్ 10న పదవీ విరమణ చేసిన సమయంలో టైప్ స్థాయి ప్రభుత్వ బంగళాలో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రిటైర్ అయిన ప్రధాన న్యాయమూర్తి ఆ తర్వాత ఆరు నెలల పాటు మాత్రమే అందులో ఉచితంగా ఉండేందుకు అనుమతిస్తారు.

అయితే, జస్టిస్ చంద్రచూడ్ ఇప్పటికీ తాను సీజేఐగా ఉన్నప్పుడు వాడిన టైప్ 8 స్థాయి బంగళాలోనే ఉంటున్నారు. దీంతో కొత్తగా నియమితులైన న్యాయమూర్తులకు ప్రభుత్వం అధికార నివాసాల కొరత తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో జులై 1న కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ కార్యదర్శికి సుప్రీంకోర్టు అధికారులు లేఖ రాశారు. "2025 మే 31తో ఆయనకు అనుమతించిన గడువు ముగిసింది. ఇకపై ఆయన బంగళా ఖాళీ చేయాల్సిన అవసరం ఉంది. 2022 నిబంధనల ప్రకారం గడువు మించిపోయినందున వెంటనే ఆస్తిని స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. జస్టిస్ చంద్రచూడ్ రాజకీయాల్లోకి వస్తారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ.. బంగ్లా వివాదం తెరపైకి రావడం గమనార్హం. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ.. నివాసం మారడంలో జాప్యానికి వ్యక్తిగత పరిస్థితులే కారణమని వెల్లడించారు. 'ఇప్పటికే నాకు ప్రభుత్వం అద్దెకు ఇల్లు కేటాయించింది. కానీ ఆ బంగ్లా గత రెండేళ్లుగా మూసి ఉంది.. దాని మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే వెళ్లిపోతాను... ఈ విషయం న్యాయస్థానం అధికారులకు ముందే తెలియజేశాను' అని వివరించారు. మాజీ ప్రధాన న్యాయమూర్తికి ప్రత్యేక అవసరాలు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు నెమలిన్ మయోపథీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. "ఇది పూర్తిగా నా వ్యక్తిగత బాధ్యత, కానీ మానవతా దృక్పథంలోనూ ఇది అర్థవంతమే. నాకు ఉన్న పరిస్థితులు కూడా ముఖ్యమే. గతంలోనూ కొందరు సీజేఐలు గడువు ముగిసినా బంగ్లాలో ఉన్న సందర్భాలు ఉన్నాయి" అని ఆయన వివరించారు. కాగా, బాబ్రీ మసీదు- రామమందిర వివాదం సమయంలో పరిష్కారం కోసం తాను దేవుడ్ని ప్రార్థించినట్లు సీజేఐగా ఉన్నప్పుడు చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఇందులో ఒకరు ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో ఉండగా, ముగ్గురు న్యాయమూర్తులు కోర్టు ట్రాన్సిట్ అపార్ట్‌మెంట్లలో తాత్కాలికంగా నివసిస్తున్నారు. కృష్ణ మీనన్ మార్గ్ బంగళా తిరిగి కోర్టు హౌసింగ్ పూల్‌కు రావాలంటే తక్షణమే జస్టిస్ చంద్రచూడ్ ఖాళీచేయాల్సిన అవసరం ఉంది.

# 20 ఏళ్లకు కలిసిన అన్నదమ్ములు..

## మరాఠా రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ సీన్..



**ముంబై- నవభూమి:** మరాఠా రాజకీయాల్లో శనివారం ఆసక్తికరమైన, అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం విడిపోయిన అన్నదమ్ములు.. ఇప్పుడు ఒక్కటయ్యారు. వారే ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే. ముంబయి వేదికగా శనివారం వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే కలిసి హాజరయ్యారు. మహారాష్ట్రలో హిందీని మూడో భాషగా అమలు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత భావించింది. అయితే విమర్శలు రావటంతో త్రిభాషా విధానం అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తాజాగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఇది ప్రతిపక్షాల విజయమంటూ ముంబయిలో శనివారం వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రే కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఒకే వేదికపై కనిపించడం మాత్రమే కాదు.. విభేదా లను పక్కనపెట్టి ఆప్యాయంగా కనిపించారు. దీంతో రెండు పార్టీ శ్రేణులు సంబరపడు తున్నాయి. మరోవైపు 2005లో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే విడిపోయారు. అయితే సుమారు 20 ఏళ్ల తర్వాత కలుసుకోవటం మరాఠా రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇక ఈ కార్యక్రమంలో రాజ్ ఠాక్రే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమను కలిపేందుకు బాల్ ఠాక్రే ఎంతో ప్రయత్నించినా సాధ్యం కాలేదని.. దేవేంద్ర ఫడ్నవీస్ కలిపారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ చేశారంటూ రాజ్ ఠాక్రే సెటైర్లు వేశారు. మహారాష్ట్రకు వ్యతిరేకంగా ఫడ్నవీస్ నిర్ణయం తీసుకోవడం ద్వారా తమను తిరిగి కలిపారని.. ఆ రకంగా అనుకోకుండానే తమని ఒకే వేదిక పైకి చేర్చారన్నారు. మహారాష్ట్ర ఐక్యత విషయంలో ఇకపై తాము ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటామని రాజ్ ఠాక్రే ప్రకటించారు. ఈ క్రమంలోనే కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. తమకు హిందీపై ఎలాంటి వ్యతిరేకత లేదన్న రాజ్ ఠాక్రే.. బలవంతంగా రుద్దాలని చూస్తే ఒప్పుకోమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధానాన్ని మహారాష్ట్రపై రుద్దుతామంటే ఏం జరుగుతుందో కేంద్ర ప్రభుత్వం ఇకనైనా గుర్తుపెట్టుకోవాలని సూచించారు. మరోవైపు ఇద్దరం కలిసే ఇక్కడకు వచ్చామని.. ఇకపై కలిసే ఉంటామని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. మరోవైపు ఇరవై ఏళ్ల పాటు వేర్వేరుగా ఉన్న అన్నదమ్ములు కలిసి పోవటంతో.. ఇప్పుడు మరాఠా రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. శివసేన (యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఇకపై కలిసే ఎన్నికల్లో పోటీ చేస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.



## బ్రొకలీతో ఆరోగ్యం

క్యాబేజీ కుటుంబానికి చెందిన బ్రొకలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వండుకుని లేదా పచ్చిగా తిన్నా మంచిదంటున్నారు నిపుణులు.

బ్రొకలీలో విటమిన్ కె, క్యాల్షియం ఎముకలను బలంగా ఉంచడంలో సహాయ పడతాయి.

ఇందులోని అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి బరువు పెరగకుండా సహాయ పడుతుంది.

విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి దోహదం చేస్తుం ది.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆర్థరైటిసకు కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటాయి.

బ్రొకలిలోని యాంటీఆక్సిడెంట్లు హానికర ఫ్రీరాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి.

ఇందులోని విటమిన్ సి, ఈ, ఫ్లేవనాయిడ్లు మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి.

బ్రొకలి చర్మాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తుంది.

అయితే ఇది థైరాయిడ్ గ్రంధి పనితీరును ప్రభావితం చేస్తుంది. కాబట్టి థైరాయిడ్ ఉన్నవారు బ్రొకలీకి దూరంగా ఉండడం మేలు.



# వేడుకల్లో వెలిగేలా



పెళ్లిళ్ల సీజన్‌లోకి అడుగు పెట్టేశాం! మరి వేడుకల్లో వెలిగిపోవాలంటే అందుకోసం వేసుకునే మేకప్ కూడా వినూత్నంగా ఉండాలి. అదెలాగో తెలుసుకుందాం!

సన్‌స్క్రీన్ అవసరమేమేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను తప్పనిసరిగా పూసుకోవాలి. వీటితో వేడుకల్లో లైట్ల వెలుగుకు చర్మం పాడవకుండా ఉంటుంది. మేకప్ కూడా ఎక్కువ సమయం పాటు తాజాగా ఉంటుంది.

**రెండు ఫౌండేషన్లు**

కెమెరా ఫ్లాష్ వెలుగుకు ముఖం మితిమీరి వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు వేసుకోవాలి. ఇందుకోసం మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ రకాలకు చెందిన ఫౌండేషన్లను కలిపి వేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖమంతా డ్యూయీ ఫౌండేషన్ వేసుకోవాలి. తర్వాత లూజ్ పౌడర్ అద్దుకోవాలి.

**బ్లష్ ముఖ్యం**

పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా... సహజసిద్ధంగా కనిపించే న్యాచురల్ లేదా రోజీ బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా లైట్‌గా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా...ముఖం మొత్తంలో కళ్లూ, పెదవులే ఫోకల్ పాయింట్లు. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలు ఎంచుకోవాలి. ముడతలు పడకుండా ఉండేందుకు క్రీమీ షాడోలకు బదులు పౌడర్ ఐ షాడో ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసిపోయి, ఎక్కువసేపు ఉంటాయి.

లవ్లీ లిప్‌స్టిక్..ఎరుపు, ప్లమ్, మెరూన్ రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు మ్యాచ్‌అయ్యే లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటిపూట, మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు మ్యాచ్ అవుతాయి.

# నైపుణ్యాల వైపు అడుగులు..

నైపుణ్యాల వైపు అడుగులు..

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి చిన్నస్థాయి మహిళా వ్యాపారవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 70 శాతం మంది ఈ వైపుగా అడుగులు వేస్తున్నారు. భారత్ ఉమెన్ ఆస్పిరేషన్ ఇండెక్స్ - 2025 నివేదికలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి చిన్నస్థాయి మహిళా వ్యాపారవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 70 శాతం మంది ఈ వైపుగా అడుగులు వేస్తున్నారు. భారత్ ఉమెన్ ఆస్పిరేషన్ ఇండెక్స్ %-% 2025 నివేదికలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. దేశంలోని ద్వితీయశ్రేణి నగరాలు, చిన్నచిన్న పట్టణాలకు చెందిన 1,300 మందికిపైగా మహిళా వ్యవస్థాపకులు ఈ సర్వేలో పాల్గొన్నారు. వీరిలో అత్యధిక మంది 18 నుంచి 55 ఏండ్లలోపు వారే! సొంతంగా వ్యాపారాలను ప్రారంభించి సమర్థంగా నిర్వహిస్తున్నా.. సంస్థాగతంగా అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. తాము ఫైనాన్స్, మార్కెటింగ్‌తోపాటు డిజిటల్ కార్యకలాపాల్లో వెనకబడి పోయినట్లు 70 శాతం మహిళా వ్యాపార యజమానులు వెల్లడించారు.



రుణాలు, వ్యాపార నెట్‌వర్క్‌లు, సరైన ప్రాతినిధ్యం లేక.. తమ ఆశయాలు నీరుగారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో సహచరుల మద్దతు, మార్గదర్శక అవకాశాలకు దూరం అవుతున్నామని చెప్పుకొచ్చారు. సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నా.. ఆర్థికంగా సొంత నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారట. వీరిలో 52 శాతం మంది ఇప్పటికీ డబ్బుల కోసం కుటుంబ పెద్దల దగ్గర చేయి చాస్తున్నారట. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తమను తక్కువ రుణ అర్హత కలిగినవారిగా భావిస్తున్నారని 54 శాతం మంది వెల్లడించారు కూడా. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన లింగ పక్షపాతాన్ని పట్టి చూపుతున్నదని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు.

ఇక తమకు ప్రభుత్వ రంగంతోపాటు మీడియాలోనూ తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మరో 49 శాతం మంది చెప్పుకొచ్చారు. ఇది కూడా మహిళల వ్యవస్థాపక సామర్థ్యాన్ని మరింత విస్తృతం చేయాల్సిన సామాజిక అవసరాన్ని సూచిస్తున్నది. 52 శాతం మంది ఇ-కామర్స్, ఎడ్‌టెక్ వంటి డిజిటల్ రంగాలలో పనిచేస్తున్నప్పటికీ.. వీరిలో 12 శాతం మంది మాత్రమే డిజిటల్ నైపుణ్యాలను కలిగి ఉన్నారట. ఈ అవరోధాలన్నీ తమ పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో, ఆయా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకొని.. వ్యాపారాలను మరింత విస్తృతపర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ నివేదిక ఒక బ్లూప్రింట్ మాత్రమేనని.. ఈ రంగంలో వ్యవస్థాగత అంతరాలను తగ్గించాల్సిన అవసరం ఉన్నదని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు. ఇందుకోసం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, వివిధ వేదికలు, విధాన రూపకర్తలు.. మహిళా వ్యవస్థాపకులకు అండగా నిలవాలని కోరుతున్నారు. వారు ఎదగడానికి సహాయపడాలనీ, అందుకు తగిన పరిష్కారాలను చూపాలని అంటున్నారు.

# నవ్వుల బాటసారి



పధ్నాలుగేళ్లకే తల్లిని పోగొట్టుకున్నారు. ఆ వయసులో పెళ్లి చేసుకోమని తండ్రి బలవంతం పెట్టడంతో... ఇల్లు వదిలి వెళ్లిపోయారు. అనుకోకుండా అమెరికా చేరి... ఉన్నత చదువులు చదివి... స్టాండప్ కమెడియన్‌గా నవ్వులు విరబూయిస్తున్నారు. స్క్రీన్ రైటర్‌గా... పాడ్‌కాస్టర్‌గా... రచయితగా... వైవిధ్యమైన పాత్రలు పోషిస్తున్న ఆమె... ఇటీవల నటిగా మరో కొత్త పాత్రలో ఒదిగిపోయారు. అమెరికాలో స్థిరపడిన భారత స్టాండప్ కమెడియన్... యాభై ఏళ్ల జర్నా గార్గ్ ముచ్చట ఇది.



"చిన్నప్పటి నుంచే కలలు కనడం... ఆ కలను నిజం చేసుకోవడానికి అహర్నిశలూ శ్రమించడం... నా జీవితంలో ఇవేవీ లేవు. నా బాల్యం, కౌమారం అంతా ముంబయి మహానగరంలోనే సాగింది. పధ్నాలుగేళ్లప్పుడు అనారోగ్యంతో మా అమ్మ మరణించింది. కొద్ది రోజులకే నాకు పెళ్లి చేయాలని నిశ్చయించారు మా నాన్న. ఇప్పుడే పెళ్లి వద్దంటే... వినలేదు.

నాలో నేనే ఎంతో బాధపడ్డాను. నా చుట్టూ ఉన్న గోడలు మీద కూలుతున్న అనుభూతి. అందరూ ఉన్నా... ఒంటరినయ్యానన్న బాధ. నా ముందు ఉన్నవి రెండే దారులు... నాన్న చూసిన అబ్బాయిని పెళ్లి చేసుకోవడం. లేదంటే ఇల్లు వదిలి వెళ్లిపోవడం. టీనేజీ వయసు కదా... ఉడుకు రక్తం. నా దారి నేను చూసుకోవాలనుకున్నా. విశేషమేమంటే... అడుగు బయట పెట్టగానే బంధువులు, స్నేహితులు నా కోసం ఇంటి తలుపులు తెరిచారు. అది ఎంతో ధైర్యాన్నిచ్చింది. నేను ఎక్కడ ఉంటే అక్కడ నవ్వులు విరబూస్తాయని అందరూ అంటుండేవారు. వారందరూ నన్ను ఆదరించడానికి అది కూడా ఒక కారణమైంది.

**సాహసోపేత నిర్ణయం...**అయితే ఇంటి నుంచి బయటకు వచ్చేశాక... ముంబయిలో ఎక్కువ రోజులు లేను. ఉన్నట్టుండి నా మనసు అమెరికా వైపు మళ్లింది. దానికి కారణం... మా అక్క. తను ఓహియోలోని ఆక్రన్‌లో ఉండేది. 'నేనూ అక్కడికి వచ్చేస్తా'నంటే సరేనంది. మరో ఆలోచన లేకుండా అమెరికా వెళ్లిపోయాను. అక్క, తన కుటుంబం నన్ను ఎంతో ఆదరించారు. నిజంగా నా జీవితంలోనే అది ఒక సాహసోపేత నిర్ణయం. 'యూనివర్సిటీ ఆఫ్ ఆక్రన్' నుంచి ఫైనాన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాను. తరువాత 'కేస్ వెస్టర్న్ రిజర్వ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా'లో లా చదివాను. కాలేజీ రోజులను ఎంతో ఆస్వాదించాను.

**పదహారేళ్లు ఇంట్లోనే...**చదువు అవ్వగానే 1998లో షలబ్ గార్గ్‌ను పెళ్లి చేసుకున్నాను. మాకు ముగ్గురు సంతానం. భర్త, పిల్లలు, వాళ్లకు కావల్సినవి చూసుకోవడం... పదహారేళ్లు ఇంట్లోనే గడిచిపోయాయి. ఒక రోజు మా పిల్లలు అన్నారు... 'అమ్మా... నువ్వు స్టాండప్ కమెడియన్‌గా ప్రయత్నించు' అని. పదిహేనేళ్లు ఇల్లాలి పాత్ర సమర్థవంతంగా పోషించిన నేను... పిల్లల ప్రోత్సాహంతో స్టాండప్ కమెడియన్‌గా కొత్త అధ్యాయం మొదలుపెట్టాను. 2018లో... న్యూయార్క్ నగరం... మైక్ పట్టుకొని వేదిక ఎక్కి తొలిసారి ప్రదర్శన ఇచ్చాను. పూర్తిస్థాయి స్టాండప్ కమెడియన్‌గా మారడానికి ఆ షో దోహదపడింది. మరుసటి ఏడాది అదే నగరంలో మరో ప్రదర్శన. నాటి నుంచి మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.స్క్రీన్ ప్లే...అయితే నేను హాస్య గుళికలు ఇవ్వడంతోనే సరిపెట్టుకోలేదు. ఎప్పటి నుంచో అంతర్లీనంగా దాగివున్న భావాలు అక్షరాలుగా బయటకు రావడం మొదలయ్యాయి. ఖాళీ దొరికినప్పుడు వాటన్నిటినీ కలం పట్టుకొని కాగితం మీద పెట్టేసేదాన్ని. ఆ క్రమంలోనే అనుకోని అవకాశం ఒకటి వచ్చింది... సినిమాకు స్క్రీన్ ప్లే రాయమని. అలా 'రీఅరేంజ్డ్' అనే చిత్రంతో రచయితను అయ్యాను. విశేషమేమంటే... ఆ చిత్రానికి 'ఆస్టిన్ ఫిలిమ్ ఫెస్టివల్'లో ఉత్తమ కామెడీ స్క్రీన్ ప్లే అవార్డు దక్కింది. పదకొండు వేల ఎంట్రీల్లో నాకు అవార్డు రావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.

ఆ తరువాత మరికొన్ని చిత్రాలకు కూడా స్క్రీన్‌ప్లే రాశాను. అంతేకాదు... ఇటీవలే నా జీవిత విశేషాలతో కూడిన సరదా పుస్తకం 'దిస్ అమెరికన్ ఉమన్' ఆవిష్కరణ జరిగింది. దానికి అద్భుతమైన స్పందన వస్తోంది.ఆత్మసంతృప్తి కోసం...బాధగా ఉన్నప్పుడు హాస్యం చికిత్సలా ఉపయోగపడుతుంది. మన దృక్పథాన్ని సానుకూలంగా మారుస్తుంది. ఇన్నేళ్ల నా ప్రయాణంలో నాకు బోధపడిన సత్యం ఇది. అందుకే సాధ్యమైనంత మందికి హాస్యం పంచడానికి ప్రయత్నిస్తున్నాను. అమెరికాలోని ప్రముఖ క్లబ్స్, ఇతర వేదికలల్లో కూడా ప్రదర్శనలు ఇస్తున్నాను. ఇవన్నీ డబ్బు తీసుకొని చేసే షోలు. కానీ ఎలాంటి పారితోషికం తీసుకోకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థల కోసం ఉచితంగా షోస్ చేస్తున్నాను. ఇది నా ఆత్మసంతృప్తి కోసం. ఈ ప్రయాణంలో ఎన్నో అవార్డులు గెలుచుకున్నాను.

## ముహర్రం: త్యాగానికి ప్రతీక

ముహర్రం పేరు వినగానే గుర్తుకు వచ్చే మొదటి చారిత్రక సంఘటన... కర్బలా మైదానంలో జరిగిన అపూర్వమైన సంగ్రామం. ఖిలాఫత్ వ్యవస్థను సుస్థిరంగా ఉంచడానికి హజ్రత్ హుసేన్ చేసిన మహత్తరమైన త్యాగానికి అది చిహ్నం. అంతేకాదు... ముహర్రం మాసంలోని పదవరోజు... ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్షి.


రాజకీయపరంగా ఇస్లాం ధర్మంలో ఖలీఫా వ్యవస్థ ఉండేది తప్ప రాచరిక వ్యవస్థ లేదు. రాకుమారుడు రాజు కావడం, మంత్రి కుమారుడు మంత్రి కావడం అనే అనువంశిక వ్యవస్థ అసలే లేదు. ఖలీఫా ఎన్నిక మూడు సూత్రాల ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేది. మహా ప్రవక్త అనుసరించిన పద్ధతి ప్రకారం... ఖలీఫాను ఎవరూ నియమించకూడదు, ప్రజలే ఎన్నుకోవాలి. రెండు... మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ మాదిరిగా... మీతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని ఖలీఫాగా సూచించవచ్చు. మూడోది... ఖలీఫా హజ్రత్ ఉమర్ మాదిరిగా... ఖలీఫా ఎన్నికను కొందరు మేధావులతో కూడిన సలహా సంఘానికి అప్పగించవచ్చు. వారు తమలో ఒకరిని ఖలీఫాగా ఎన్నుకుంటారు. కానీ హజ్రత్ మావియా తన కుమారుడైన యజీద్‌కు యువరాజ పట్టాభిషేకం చేసి... పై మూడు ధర్మ సూత్రాలను కాలరాశాడు. అక్కడి నుంచే రాచరిక వ్యవస్థ ఆరంభమయింది.

యజీద్ కుతంత్రం...మహాప్రవక్త మహమ్మద్ దివంగతులైన తరువాత.. మొదటి ఖలీఫాగా హజ్రత్ అబూబకర్, రెండో ఖలీఫాగా హజ్రత్ ఉమర్, మూడో ఖలీఫాగా హజ్రత్ ఉస్మాన్, నాలుగో ఖలీఫాగా హజ్రత్ అలీ ఎన్నికయ్యారు. ఆ తరువాత ఖలీఫా అయిన హజ్రత్ ముఆవియా 19 ఏళ్ళపాటు అరేబియా దేశాన్ని పాలించాడు. కానీ పుత్రప్రేమతో... అయోగ్యుడైన, దురలవాట్లకు లోనైన తన కుమారుడు యజీద్‌ను యువరాజుగా నియమించాడు. ఇస్లాం ధర్మానికి వ్యతిరేకమైన ఈ చర్యపై దైవప్రవక్త మహమ్మద్ మనుమడైన ఇమామ్ హుసేన్, ఆయన అనుచరులు బాహాటంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. యజీద్‌ను రాజుగా ఒప్పుకొనేది లేదంటూ తిరుగుబాటు చేశారు. అదే సమయంలో... ఇమామ్ హుసేన్ తమ వద్దకు వస్తే ఆయనను ఖలీఫాగా గుర్తిస్తామంటూ కూఫా నగర ప్రజలు ఉత్తరాలు రాశారు. మరోవైపు ప్రజలందరూ ఉవ్వెత్తున ఉద్యమించారు. ఈ నేపథ్యంలో యజీద్‌తో ముఖాముఖి చర్చలు జరపడానికి మక్కా నగరం నుంచి కుఫా నగరానికి తన 72 మంది ప్రత్యక్ష సహచరులతో, కుటుంబ సభ్యులతో ఇమామ్ హుసేన్ బయలుదేరారు. వారు కుఫా నగరానికి చేరకమునుపే... తన ప్రభుత్వాన్ని ఇమామ్ హుసేన్ గుర్తించేలా చేయడానికి యజీద్ కుట్రలు పన్నాడు. కానీ యజీద్‌ను రాజుగా గుర్తించడానికి ఆయన అంగీకరించలేదు. తనలో ప్రాణం ఉన్నంతవరకు అధర్మంతో పోరాడుతూనే ఉంటానని ప్రకటించారు. దాని ఫలితమే కర్బలా యుద్ధం.

ధర్మరక్షణ కోసం...ఇమామ్ హుసేన్ ప్రదర్శించిన ధిక్కారానికి, తిరుగుబాటు ధోరణికి యజీద్ ఆగ్రహోదగ్రుడయ్యాడు. అతని సైన్యం హజ్రత్ హుసేన్‌ను, ఆయన పరివారాన్ని కర్బలా అనే ప్రదేశం దగ్గర

అటకాయించింది.

రికి నీటిబొట్టు కూడా అందకుండా ఫరాత్ నది ఒడ్డుపై గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇరు పక్షాల మధ్యా భీకరమైన యుద్ధం జరిగింది. శత్రువులు నాలుగువేలమంది కన్నా ఎక్కువగా ఉండడంతో ఇమామ్ హుసేన్ సైన్యంలో చాలామంది అమరులయ్యారు. చివరకు ఇమామ్ హుసేన్ ఒంటరిగా యుద్ధరంగంలో మిగిలిపోయారు. దప్పికకు తట్టుకోలేక... శత్రుమూకను చెండాడుతూ ఫరాత్ నదివైపు నీళ్ళకోసం వెళ్ళారు. ఈలోగా మహిళలు, పిల్లలు ఉన్న తమ గుడారాలకు నిప్పు పెట్టారనే వదంతి విని... దప్పిక తీర్చుకోకుండానే వెనుతిరిగారు. గుడారాలకు నిప్పు పెట్టలేదు కానీ తన కుమారుడు అలీ అస్గర్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసింది. ఆ పసిబాలుణ్ణి చేతుల్లోకి తీసుకొని... అతని కోసం గుక్కెడు నీళ్ళయినా ఇవ్వాలని శత్రు సైన్యాన్ని




ఇమామ్ హుసేన్ ప్రాధేయపడ్డారు. కానీ పాషాణ హృదయులైన ఆ సైనికులు... ఆయన కుమారుడి మీద బాణాల వర్షం కురిపించారు. ఒక బాణం ఆ పసికందు గొంతులో దిగి... రక్తం చిమ్మింది. ఈ ఘోరాన్ని చూసిన ఇమామ్ హుసేన్ శత్రుసైన్యంపై విరుచుకుపడ్డారు. శత్రువులు ఆయనను హతమార్చడానికి నలువైపులా కమ్ముకొని ఉన్నారు. ఆరోజు నమాజ్ సమయం కావడంతో ఆయన యుద్ధాన్ని ఆపి... సజ్దా చెయ్యడానికి శిరస్సును భూమి మీద పెట్టారు. వెంటనే శత్రువులు ఆయన మీద దాడి చేసి హతమార్చారు. ఆయన శిరస్సును, చేతులను ఖండించారు. వాటిని బల్లేలకు, బరిసెలకు తగిలించి గంతులేశారు. ఇలా ఒక మహా మనిషి తను నమ్ముకున్న ధర్మాన్ని రక్షించడం కోసం అసువులుబాశారు. ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, అనుపమాన త్యాగం చరిత్రలో నిలిచిపోయాయి.

ఎన్నో విశిష్టతలు...ఈ విశ్వ సృష్టి జరిగినప్పటి నుంచి ముహర్రం మాసంలో చారిత్రకమైన సంఘటనలు ఎన్నో జరిగాయి. ఈ నెలలో పదోరోజున ప్రథమ దైవప్రవక్త స్వర్గంలోకి ప్రవేశించారు. దైవప్రవక్త హజ్రత్ నూహ్‌నూ, ఆయన అనుచరులను దైవం నావలో రక్షించి, శత్రువులను శిక్షించినది కూడా ఆ రోజునే. అలాగే దైవప్రవక్త హజ్రత్ యూనుసకు చేప గర్భం నుంచి విముక్తి కలిగించినది, దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంను దుర్మార్గుడైన నమ్రూద్ రాజు అగ్ని గుండంలోంచి కాపాడినదీ, ఫిరౌన్ రాజును, అతని లక్షలాది సైన్యాన్ని సముద్రపు నీటిలో ముంచేసి... దైవప్రవక్త మూసాను, ఆయన అనుచరులను కాపాడింది కూడా ఈ రోజునే. మహాప్రవక్త మహమ్మద్ గారాల మనుమడు ఇమామ్ హుసేన్ ప్రాణత్యాగం చేసినది కూడా ఆ రోజే. కాబట్టే ఈ రోజుకు, తద్వారా ఈ మాసానికి ఇంతటి ప్రాధాన్యత, ఎనలేని గౌరవ ప్రతిష్టలు లభించాయి.ఉపవాసం పుణ్యప్రదం

ఇస్లామీయ క్యాలెండర్ ప్రకారం తొలి మాసం ముహర్రం. ఇది ముస్లింలు అతి పవిత్రంగా పరిగణించే నాలుగు ప్రత్యేకమైన నెలల్లో ఒకటి. ముహర్రం అంటే 'నిషిద్ధమైన' లేదా 'పవిత్రమైన' అని అర్థం. ఈ నెలలో యుద్ధాలు, హింస లాంటివి పూర్తిగా నివారించాలని ఇస్లాం హితవు చెబుతోంది. ముహర్రం మాసంలోని పదవ రోజు... హజ్రత్ మూసా తన జాతివారికి ఫిరౌన్ నుంచి విముక్తి కలిగించిన రోజు అది. కాబట్టి వారు ఆ రోజున ఉపవాసం ఉండేవారు. అంతేకాదు, అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ కూడా ఉపవాసం పాటించేవారు. "మీరు కూడా ముహర్రం ఉపవాసం చేయండి, గత ఏడాది చేసిన పాపాలు క్షమాపణ దొరుకుతుంది. రంజాన్ నెల ఉపవాసాల తరువాత... అల్లాహ్ మాసమైన ముహర్రం నెలలో పాటించే ఉపవాసాలు అత్యంత పుణ్యప్రదమైనవి, ఫర్జ్ నమాజుల తరువాత... రాత్రివేళ ఆచరించే తహజ్జుద్ నమాజులు అత్యుత్తమమైనవి" అని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయం ప్రకారం ముహర్రం మాసంలోని 9, 10 లేదా 10, 11 రోజుల్లో రెండు రోజులు ఉపవాసాలు పాటించాలి.

## హస్తకళాభరణం!

బంగారపు హంగులు లేవు. వెండికే సొంతమైన ధగధగల్లేవు. ముత్యాల మెరుపుల్లేవు. రత్నాల రాచ మర్యాదలూ లేవు. అయితేనేం, ఆ నగల వగలు చూడాల్సిందే. ధర తక్కువ. వైవిధ్యం ఎక్కువ. కళాత్మకతా అధికమే. ఏ చీర కట్టుకుంటే ఆ వన్నె హారం ధరించవచ్చు. అదే రంగు ఇయర్ రింగ్స్ సింగారించుకోవచ్చు. అంతేనా, ఎకోఫ్రెండ్లీ కూడా. బంకమన్ను, గుడ్డ పేలికలు, పూసలు, దారాలు, సహజమైన రంగులు.. ఇవే ముడి సరుకు. హ్యాండ్ మేడ్ హారాలే కాదు.. జుంకాలు, ముక్కుపుడకలు, గాజులు కూడా లభిస్తాయి.



## టాలీవుడ్‌లో నిధి అగర్వాల్ హవా మాములుగా లేదుగా.. అందరు స్టార్ హీరోలు ఆమె వెనకే..!



ఒకప్పుడు ఇండస్ట్రీని షేక్ చేసిన భామలు ఇప్పుడు ఫేడ్ ఔట్ అయ్యారు. శ్రీలీలనే కాస్త నెట్టుకుంటూ వస్తుంది. ఫ్లాపులు వస్తున్నా కూడా వరుస అవకాశాలు దక్కించుకోవడం విశేషం. అయితే ఇప్పుడు టాలీవుడ్ టాప్ హీరోలు అందరు కూడా ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్‌పైన ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. ఈ బ్యూటీ ఇప్పటికే పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రంతో పాటు ప్రభాస్ రాజా సాబ్ చిత్రంలో నటిస్తుంది. ఈ రెండింట్లో ఒక్క సినిమా హిట్ అయిన నిధి కెరీర్ గ్రాఫ్ మరింత పెరగడం ఖాయంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే నిధి ఖాతాలో మరో టాలీవుడ్ ప్రాజెక్ట్ చేరినట్టు తెలుస్తుంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాను చేయబోతున్నవిషయం తెలిసిందే. వీరి కాంబినేషన్ లో రానున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనైతే రాలేదు కానీ ప్రీ ప్రొడక్షన్ పనులు అయితే శరవేగంగా సాగుతున్నాయి. ఈ సినిమాకు వెంకట రమణ కేరాఫ్ ఆనంద నిలయం అనే టైటిల్ ను అనుకుంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సమాచారం. మరో హీరోయిన్‌గా త్రిష ఉంటుందని టాక్ నడుస్తుంది. త్వరలో సినిమాను మొదలుపెట్టి 2026 సమ్మర్ కు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్‌గా తెలుస్తుంది. వెంకీ కెరీర్లో 77వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులని అలరించే విధంగా ఉంటుందని అంటున్నారు.

నవచిత్ర



## రుక్మిణి మీద సుక్కు కన్ను..?



కన్నడ భామ రుక్మిణి వసంత్ తెలుగులో వరుస క్రేజీ ఆఫర్స్ అందుకుంటుంది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ లో సూపర్ పాపులారిటీ సంపాధించిన అమ్మడు ప్రస్తుతం ఎన్ టీ ఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో ఛాన్స్ దక్కించుకోవడమే ఆలస్యం తెలుగులో ఆమెకు ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఒకటి రెండు ఆఫర్స్ ఆమెకు వచ్చాయని తెలుస్తుంది. ఇదిలాఉంటే సుకుమార్ కూడా రుక్మిణి వసంత్ గురించి ఆలోచిస్తున్నాడని టాక్. పుష్ప 2 తర్వాత సుకుమార్ నెక్స్ట్ సినిమా రాం చరణ్ తో చేస్తాడన్న విషయం తెలిసిందే. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. చరణ్ పెద్ది తర్వాత చేయబోయే ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే అంచనాలు బాగున్నాయి. సుకుమార్ తో చరణ్ రంగస్థలం సినిమా చేసి బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. ఇక ఇప్పుడు మళ్లీ ఆ కాంబినేషన్ రిపీట్ అవ్వడం ఫ్యాన్స్‌కి మరో ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాలో చరణ్‌కి జోడీగా రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని సుకుమార్ థింగ్ చేస్తున్నాడట. రుక్మిణి వసంత్‌కి తెలుగులో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆమె నటించిన సప్త సాగరాలు దాటి సినిమా తెలుగు ఆడియన్స్ ని అలరించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి మన ప్రేక్షకులు ఫిదా అయ్యారు. . ప్రస్తుతం తారక్‌తో సినిమా చేస్తున్న రుక్మిణి నెక్స్ట్ సుకుమార్ చరణ్ కాంబో సినిమాలో కూడా నటించే ఛాన్స్ లు ఉన్నట్టు తెలుస్తుంది. ఆ ప్రాజెక్ట్ కన్ ఫర్మ్ అయితే మాత్రం రుక్మిణి నెక్స్ట్ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అవుతుందని చెప్పడంలో సందేహం లేదు. ఇప్పటికే ఎన్‌టీఆర్‌తో జత కడుతుంది అనే సరికి ఆమె రేంజ్ పెరిగింది. అంతేకాదు రెమ్యునరేషన్ కూడా బాగా పెంచేసిందని టాక్. ఇప్పుడు సుక్కు కూడా ఆమెను ఓకే చేస్తే మాత్రం రుక్మిణిని ఆపడం కష్టం. సో కన్నడ భామ రుక్మిణి వసంత్ కూడా తెలుగులో సూపర్ ఫాం లో వచ్చే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. రుక్మిణి వసంత్ కూడా తెలుగు సినిమా ఛాన్స్ లతో పాటు ఇక్కడ ఆడియన్స్ తన మీద చూపిస్తున్న ప్రేమకు సంతోషంగా ఉన్నట్టు తెలుస్తుంది.

## కాజల్ వల్ల సాయి పల్లవిపై మరోసారి ట్రోలింగ్!



సాయి పల్లవి టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సాయి పల్లవి ఏదైనా ఒక పాత్ర చేస్తున్నారంటే ఆ పాత్రకు ప్రాణం పోయడం ఖాయం. ఇంకా చెప్పాలంటే హీరోయిన్ కు అందం ముఖ్యమైనది కాదని, యాక్టింగ్ తో గ్లామర్ ను కూడా డామినేట్ చేయొచ్చని సాయి పల్లవి నిరూపించారు. ఇప్పటికే సాయి పల్లవి ఎన్నో సినిమాల్లో గుర్తుండిపోయే పాత్రలు చేసి మెప్పించారు. ఇక అసలు విషయానికొస్తే సాయి పల్లవి ప్రస్తుతం నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాలీవుడ్ రామాయణలో సీత పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఎప్పుడైతే సాయి పల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేశారో అప్పట్నుంచి ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ వినిపిస్తోంది. అయితే సాయి పల్లవి సీత పాత్రను పోషించడం కొందరు స్వాగతిస్తుంటే మరికొందరు మాత్రం సాయి పల్లవి సీత పాత్ర చేయడం కన్విన్సింగ్‌గా లేదని దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 2 ఏళ్లలో 200 స్క్రీన్లు వాల్మీకి రాసిన రామాయణంలో సీతను ఎంతో గొప్పగా వర్ణించారని, వాల్మీకి ప్రకారం సీత ఎంతో అందమైన ప్రతిరూపమని, సీతను ఆకాశంలో ఉండే చంద్రకాంతితో పోల్చడంతో పాటూ భూమి నుంచి జన్మించిన లక్ష్మి అంటారని, అలాంటి సౌందర్యవతి సీతను అందం విషయంలో సాయి పల్లవి ఏ మాత్రం మ్యాచ్ చేయలేరని అందరూ కామెంట్స్ చేస్తున్నారు. నితేష్ తివారీ క్యాస్టింగ్ విషయంలో చాలా బ్లండర్ చేశారని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ ను తీసుకోవడం నెటిజన్ల డిస్కషన్స్ కు మరింత ఆజ్యం పోస్తుంది. రావణాసురుడిగా నటించిన యష్, సీత పాత్రలో కనిపించే సాయి పల్లవి అందం కోసం, మండోదరిగా కనిపించే కాజల్ ను ఎందుకు వదులుకుంటారని ప్రశ్నిస్తూ విమర్శలు చేస్తున్నారు. అయితే కొందరు సాయి పల్లవిని విమర్శిస్తున్నప్పటికీ మరికొందరు ఆమెకు ఈ విషయంలో మద్దతిస్తున్నారు. సీత పాత్రకు సాయి పల్లవి కేవలం అందంతోనే కాకుండా ఆమె నటనతో ప్రాణం పోస్తారని, ఎమోషనల్ గా సాయి పల్లవి ఆ పాత్రను అందరికీ కనెక్ట్ అయ్యేలా చేస్తారని తమ వాదనలను వినిపిస్తున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ తో సాయి పల్లవి ఇప్పటికే నటిగా తానేంటో ప్రూవ్ చేసుకున్నారని ఇప్పుడు సీత పాత్రలో అందరినీ మెప్పించి నటిగా మరో మెట్టు ఎక్కుతారని పేర్కొంటున్నారు. ఎంతో అనుభవమున్న డైరెక్టర్ నితేష్ తివారీ ఇలాంటివేవీ ఆలోచించకుండానే సీత పాత్రకు ఆమెను సెలెక్ట్ చేయరు కదా అని సాయి పల్లవిని సపోర్ట్ చేస్తూ విమర్శకులను ప్రశంసిస్తున్నారు. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రావణుడిగా యష్, హనుమంతుడిగా సన్నీడియోల్ నటిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుండగా, మొదటి భాగం ఈ దీపావళికి, రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ కానున్నాయి.

## 'లక్కీ భాస్కర్'కు సీక్వెల్.. కన్‌ఫర్మ్ చేసిన దర్శకుడు వెంకీ అట్లూరి



మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'లక్కీ భాస్కర్' మీనాక్షి చౌదరి కథానాయికగా నటించగా.. నాగవంశీ నిర్మించాడు. అయితే ఈ సినిమా అనంతరం వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్యతో ఒక సినిమా చేస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు వెంకీ అట్లూరి. తనకు బ్లాక్ బస్టర్‌ను అందించిన 'లక్కీ భాస్కర్' సినిమాకు సీక్వెల్ ఉంటుందని తెలిపాడు. గత ఏడాది (2024లో) విడుదలైన 'లక్కీ భాస్కర్' అనూహ్య విజయాన్ని సాధించి, విమర్శకుల ప్రశంసలు పొందడంతో పాటు బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి జీవితం అనుకోని మలుపులు తిరిగి, ఆర్థిక అక్రమాల్లో చిక్కుకోవడం అనే కథాంశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా క్లైమాక్స్ కూడా సీక్వెల్‌కు ఆస్కారం కల్పించే విధంగా ముగియడంతో, అప్పటి నుంచే పార్ట్ 2పై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, వెంకీ అట్లూరి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ సూర్యతో 'సూర్య 46' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ బిజీలో ఉన్నప్పటికీ, 'లక్కీ భాస్కర్' సీక్వెల్ కచ్చితంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ధనుష్‌తో తాను తీసిన 'సార్' (వాథి) సినిమాకు మాత్రం సీక్వెల్ ఉండదని కూడా ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. 'లక్కీ భాస్కర్' సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుంది, కథాంశం ఎలా ఉంటుంది అనే విషయాలపై మరింత సమాచారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన చిత్రంగా నిలిచిన 'లక్కీ భాస్కర్'కు సీక్వెల్ ఖచ్చితంగా మరో బ్లాక్‌బస్టర్ అయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## పాయల్ కిల్లింగ్ లుక్స్.. పిచ్చెక్కిపోవాలంతే..!



లేటెస్ట్‌గా పాయల్ గ్లామర్ షో చేస్తూ షేర్ చేసిన ఫోటో షూట్ ఆమె ఫాలోవర్స్ ని పిచ్చెక్కిపోయేలా చేసింది. బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ జాకెట్, డెనిమ్ షార్ట్ తో పాయల్ అందాల రచ్చ ఆడియన్స్ కి కనువిందు చేస్తుంది. బ్యూటీ పాయల్ రాజ్ పుత్ ఎందుకో కెరీర్ లో వెనకపడింది. మంగళవారం తర్వాత మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని భావించినా ఎందుకో అమ్మడు సరైన ఛాన్స్ లు అందుకోవట్లేదు. లాస్ట్ ఇయర్ రక్షణ అంటూ ఒక అటెంప్ట్ చేసింది కానీ అది కూడా వర్క్ అవుట్ కాలేదు. ఇక ప్రస్తుతం ఆది సాయి కుమార్ హీరోగా చేస్తున్న కిరాతక సినిమాలో నటిస్తుంది పాయల్. ఆ సినిమాతో పాటు తమిళ్ లో గోల్ మాల్, ఎంజల్ అనే రెండు సినిమాలు చేస్తుంది. అంతకుముందు పంజాబి, హిందీ, తెలుగు, ఒక కన్నడ సినిమా మాత్రమే చేసిన పాయల్ రాజ్ పుత్ ఇప్పుడు తమిళ పరిశ్రమకు ఎంట్రీ ఇస్తుంది. ఐతే పాయల్ సినిమాల కన్నా తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని ఎప్పుడు నిరాశ చెంద నివ్వదు పాయల్. ఈ క్రమంలో తన ఫోటో షూట్స్ వారిని ఎంటర్టైన్ చేస్తాయి. 2 ఏళ్లలో 200 స్క్రీన్లు లేటెస్ట్ గా పాయల్ గ్లామర్ షో చేస్తూ షేర్ చేసిన ఫోటో షూట్ ఆమె ఫాలోవర్స్ ని పిచ్చెక్కిపోయేలా చేసింది. బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ జాకెట్, డెనిమ్ షార్ట్‌తో పాయల్ అందాల రచ్చ ఆడియన్స్ కి కనువిందు చేస్తుంది. అంతేకాదు ఆ గ్లామర్ షోకి తోడు అమ్మడి ఓర చూపులు మెంటల్ ఎక్కించేస్తున్నాయంటే నమ్మాల్సిందే. ఒక స్టార్ మెటీరియల్ అయిన పాయల్ రాజ్ పుత్ ఇలా కేవలం ఫోటో షూట్స్‌కే అంకితం అవ్వడం ఇబ్బందిగానే అనిపించినా అమ్మడు మాత్రం తన కెరీర్, తన ఫ్యాన్స్‌తో సంతృప్తి చెందుతుంది. పాయల్ రాజ్ పుత్‌కి సినిమాల ఫలితాలు వాటి వల్ల వచ్చే ఛాన్స్ లు ఎలా ఉన్నా ఇలా ఫోటో షూట్స్ తోనే ఎక్కువ మైలేజ్ వస్తుంది. మరి అమ్మడు తిరిగి ఫాంలోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా అవకాశాలు పెద్దగా రావట్లేదు. ఐతే పాయల్ ఫ్యాన్స్ మాత్రం తమకు ఇలా ఫోటో షూట్స్ చేసినా చాలని అంటున్నారు. పాయల్ లాంటి అందాల భామ ఇలా కెరీర్ లో వెనకపడం ఆమె ఫ్యాన్స్ ని కలవరపరిచేలా చేస్తుంది.

## అమెరికాలో ల్యాండ్ అయిన అల్లు అర్జున్.. లుక్ మాములుగా లేదుగా..!



పాన్ ఇండియా స్టార్‌గా మారిన అల్లు అర్జున్ ఇప్పుడు తన కెరీర్‌ని గట్టిగా ప్లాన్ చేస్తున్నాడు. పుష్ప చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బన్నీ, పుష్ప 2: ది రూల్ సినిమాతో బాక్సాఫీస్ దుమ్ములేపేసాడు. గంధపు చెక్కల స్మగ్లర్ "పుష్పరాజ్" పాత్రకు అతనికి జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడం ఆయన క్రేజ్‌ను మరింత పెంచింది. ఇప్పుడు ఈ స్టార్ హీరో తన మార్కెట్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లేందుకు మాస్ డైరెక్టర్ అట్లీతో కలిసి ఓ భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌కు సైన్ చేశాడు. ఈ చిత్రం బన్నీ కెరీర్‌లోనే యూనిక్ ప్రాజెక్ట్‌గా నిలవబోతోందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఇక తాజాగా అల్లు అర్జున్ అమెరికాలోని ఫ్లోరిడా, టాంపా నగరానికి చేరుకొని, అక్కడ జరిగే %చీూుూ (చీశీతీ్ష ూఎవతీఱషa ువశ్రీబస్త్రబ ూశీఎఎబఅఱ్వ%) 2025 సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఆయనకు నాట్స్ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ముందు అల్లు అర్జున్ మాట్లాడే అవకాశం ఉండటం, అభిమానుల్లో ఉత్సాహం రేకెత్తిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో పలువురు టాలీవుడ్ సెలబ్రిటీలు పాల్గొంటారు. అయితే అల్లు అర్జున్‌కి అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో కూడా విశేషమైన ఫ్యాన్ బేస్ ఉంది. ఇప్పుడు %చీూుూ% లాంటి ప్లాట్‌ఫామ్‌పై ప్రత్యక్షంగా అభిమానులను కలవడం వల్ల ఆయన భవిష్యత్ చిత్రాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి క్రేజ్ ఉంటుంది. షారుఖ్ ఖాన్‌తో జవాన్ వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన అట్లీ..అల్లు అర్జున్‌తో భారీ ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాపై ఓ రేంజ్‌లో అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం పాన్ వరల్డ్ సినిమాగా మారుతుందని చెప్పుకొస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమా బన్నీ కెరీర్‌లోనే తొలిసారి మాస్ మేనరిజంతో పాటు టెక్నికల్ ట్రీట్ కూడా ఇస్తుందని విశ్వసిస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ ప్యాంట్ వేసుకున్న అకీరా.. ట్రోల్ చేస్తున్న నెటిజన్స్



కొందరు యాంటి ఫ్యాన్స్ అకీరాని ట్రోల్స్ చేస్తూ ఉన్నారు. ఇటీవల పవన్‌తో మెరిసిన అకీరా ఆ సమయంలో తన తండ్రి ప్యాంట్ వేసుకొని వచ్చాడంటూ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో పవన్ కళ్యాణ్ వేసుకున్న ప్యాంట్‌ని కప్‌బోర్డ్ నుండి తీసుకొని అకీరా వేసుకొని వచ్చాడంటూ కొందరు ట్రోల్ చేస్తున్నారు. అయితే దీనికి మెగా ఫ్యాన్స్ గట్టిగానే బదులు ఇస్తున్నారు. అవి రెండు సేమ్ మోడల్ ఉన్నా కలర్ కాస్త తేడా ఉంది. అంతేకాదు ఇద్దరి సైజులు వేరు కూడా. కాస్త తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందంటూ గట్టి వార్నింగ్‌లు ఇస్తున్నారు.

## అడివి శేష్ 'డెకాయిట్' షూటింగ్‌లో జాయిన్ అయిన మృణాల్ ఠాకూర్



టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్. షానీల్ డియో దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ఈ సినిమాను హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తుండగా.. ఇటీవలే విడుదలైన సినిమా పవర్-ప్యాక్డ్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అయితే ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో నటి మృణాల్ ఠాకూర్ జాయిన్ అయ్యింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రకటించారు. ప్రస్తుత షెడ్యూల్‌లో మేకర్స్ అడివి శేష్, మృణాల్ ఠాకూర్‌పై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.

ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, అనురాగ్ కశ్యప్, కామక్షి భాస్కర్లా వంటి ప్రముఖ నటులు కూడా భాగమయ్యారు. ఈ సినిమాకు అడివి శేష్ మరియు షానీల్ డియో సంయుక్తంగా కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సుప్రియ యార్లగడ్డ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.

## ఔను.. చేజ్ చేస్తారు.. టీమిండియా కోచ్ సెటైర్లు మామూలుగా లేవుగా!



**న్యూఢిల్లీ-నవభూమి:** బజ్‌బాల్ ఫార్ములాతో టెస్ట్ దేశాలను భయపెడుతోంది ఇంగ్లండ్. ధనాధన్ ఆటతీరుతో సుదీర్ఘ ఫార్మాట్‌లో రచ్చ చేస్తోంది. డ్రాకు తావివ్వకుండా మ్యాచ్‌లో రిజల్ట్ రాబట్టడమే లక్ష్యంగా దూసుకెళ్తోంది స్టోక్స్ సేన. గెలుపో, ఓటమో ఏదో ఒకటి తేలాల్సిందే అనే ధోరణితో ఆడుతోంది. అయితే ఈ క్రమంలో వరుస విజయాలు రావడం, బజ్‌బాల్ ఫార్ములా సక్సెస్ అవడంతో ఓవరాక్షన్ చేస్తోంది. ఎంత స్కోరైనా ఛేదిస్తామంటూ బిల్డప్ ఇస్తోంది. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లోనూ తాము ఎంత లక్ష్యమైనా ఛేజ్ చేస్తామంటూ ఆ టీమ్ ప్లేయర్లు, మేనేజ్‌మెంట్ కామెంట్స్ చేశారు. దీంతో వాళ్లకు ఇచ్చిపడేశాడు భారత బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్. ఔను.. నిజమే, చేజ్ చేస్తారంటూ ఆ టీమ్ గాలి తీసేశాడు. ఔను.. ఎప్పటిలాగే ఇంగ్లండ్ ఛేజింగ్ చేస్తుందంటూ సెటైర్ వేశాడు మోర్కెల్. ఎంత స్కోరు అయినా వాళ్లు ఛేదనలో బాదుడు మంత్రంతో ఆడతారనే విషయం తమకూ తెలుసునని అన్నాడు. పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు సహకరిస్తున్నందున అటాకింగ్ ప్లేయర్లతో నిండిన ఇంగ్లండ్.. తప్పకుండా వాళ్ల తరహాలోనే బ్యాటింగ్ చేస్తుందని మోర్కెల్ తెలిపాడు. అయితే తమ దగ్గర సిరాజ్, ఆకాశ్‌దీప్ రూపంలో అద్భుతమైన పేస్ అటాక్ ఉందని.. ప్రత్యర్థిని ఎలా కూల్చాలో తమకు తెలుసునంటూ హెచ్చరికలు చేశాడు మోర్కెల్.


## ఫుట్‌బాల్ ప్రపంచంలో కుదుపు.. ఇలాంటి ఘటన ఎప్పుడూ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆటల్లో గాయాలు సహజమే. అందునా ఫుట్‌బాల్ లాంటి కాంటాక్ట్ గేమ్స్‌లో ఇది మరీ ఎక్కువ. బంతిని డిఫెండ్ చేసే క్రమంలో ఒకర్నొకరు ఢీకొని ప్లేయర్లు గాయాలబారిన పడిన సందర్భాలు బోలెడు. ఇలా గాయాల వల్ల నెలల పాటు ఆటకు దూరమవడం కూడా చూస్తుంటాం. అలాంటి ఓ ఘటనే తాజాగా చోటుచేసుకుంది. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని కుదిపేసిన ఆ ఘటన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ మ్యాచ్‌లో చోటుచేసుకుంది. పారిస్ సెయింట్-జర్మన్ ఎఫ్‌సీకి బెయర్న్ మ్యూనిక్‌కు జరిగిన మ్యాచ్‌లో మిడ్‌ఫీల్డర్ జమాల్ ముసియాలా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుత తరం ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న జమాల్ ముసియాలా క్లబ్ వరల్డ్ కప్ మ్యాచ్‌లో గాయం బారిన పడ్డాడు. మ్యూనిక్ టీమ్ తరఫున బరిలోకి దిగిన ఈ ఫుట్‌బాలర్.. బంతిని తన అధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నంలో ప్రత్యర్థి గోల్‌కీపర్ డొన్నరుమ్మాను ఢీకొట్టాడు. అప్పటికే బంతిని అందుకునేందుకు వచ్చిన డొన్నరుమ్మా నేల మీద డైవ్ చేసేశాడు. దీంతో వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చిన జమాల్ అతడ్ని ఢీకొట్టి కిందపడిపోయాడు. ఈ క్రమంలో జమాల్ ఎడమ కాలి మడమకు తీవ్ర గాయమైంది. ఢీకొన్న వేగానికి మడమ ఎముక పక్కకు జరిగింది. దీంతో నొప్పి తట్టుకోలేక కాలును పట్టుకొని బాధతో విలవిల్లాడాడు. సహచరులు వచ్చి ధైర్యం చెప్పినా అతడు ఏడుస్తూనే ఉండిపోయాడు.

నవక్రీడ

## ఇంగ్లండ్ గాలి తీసేసిన పంత్.. ఇప్పుడు మొహం ఎక్కడ పెట్టుకుంటారు!



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్‌లో స్లెడ్జింగ్ సర్వసాధారణమే. టెస్ట్ క్రికెట్‌లో ఇది కామన్ అయిపోయింది. అందుకే సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆటగాళ్లు ఫిజికల్‌గా మాత్రమే ఫిట్‌గా ఉంటే సరిపోదు. మానసికంగానూ బలంగా ఉండటం తప్పనిసరి. ప్రత్యర్థుల కవ్వింపులను తట్టుకొని నిలబడాలి. స్లెడ్జింగ్ లాంటివి చేసినా ఆటతీరుతోనో లేదా మాటలతోనూ కౌంటర్ అటాక్ చేయాలి. ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాడు టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్. మాటకారి అయిన పంత్.. తన బ్యాట్‌తోనే కాదు.. మాటలతోనూ ప్రత్యర్థులకు ఇచ్చిపడేస్తున్నాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో రెండో ఇన్నింగ్స్‌లో రాణించాడు పంత్. 58 బంతుల్లో 65 పరుగుల ధనాధన్ నాక్‌తో జట్టు భారీ ఆధిక్యం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే అతడు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ప్రత్యర్థి జట్టు బ్యాటర్ హ్యారీ బ్రూక్ రెచ్చగొట్టాడు. నా రికార్డుల గురించి తెలుసా అంటూ ఓవరాక్షన్ చేశాడు. నీ ఫాస్టెస్ట్ హండ్రెడ్ ఎంత అంటూ భారత బ్యాటర్‌ను అడిగాడు బ్రూక్. దీంతో టెస్టుల్లో 80 నుంచి 90 బంతుల్లో శతకం బాదాను అనుకుంటా అని పంత్ కాస్త సందేహిస్తూ సమాధానం ఇచ్చాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**